# వాస్తవం

ఆదివారం 26.07.2026

డెయిలీ. కామ్

డిజిటల్ పత్రిక

ఉన్నది ఉన్నట్లుగా

ఎడిటర్: ఎం.కృష్ణారెడ్డి(కె.ఆర్)


## రెండో టీ20లో జింబాబ్వే చిత్తు

### సిరీస్ టీమిండియాదే

**హరారే :** హరారే వేదికగా జింబాబ్వేతో జరిగిన రెండో టీ20లో భారత జట్టు 90 పరుగుల తేడాతో ఘన విజయం సాధిం చింది. మూడు టీ20ల సిరీస్‌ను టీమిం డియా 2-0 తేడాతో సొంతం చేసుకుంది. ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనల పరాజయాల తర్వాత శ్రేయస్ అయ్యర్ నాయకత్వంలో భారత టీ20 జట్టు తొలిసారిగా సిరీస్‌ను పట్టే సింది. 220 పరుగుల లక్ష్య ఛేదనలో జిం బాబ్వే పూర్తిగా తడబ డింది. 17.5 ఓవర్లలో 129 పరుగులకే కుప్ప కూలింది.జింబాబ్వే బ్యాటర్లలో బ్రియాన్ బెన్నెట్(32) టాప్ స్కోర ర్. మిగతా బ్యాటర్లంతా స్వల్ప స్కోరుకే పరిమితమ య్యారు. టీమిండియా బౌలర్లలో అభిషేక్ శర్మ 3 వికెట్లతో చెలరేగాడు. అరంగేట్ర బౌలర్ యశ్ ఠాకూర్ 2, ప్రిన్స్ యాద వ్ 2, శివమ్ దూబె, రవి బిష్ణోయ్, తిలక్ వర్మ తలొక వికెట్ పడగొట్టారు. అంతకు ముందు టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన భారత్.. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 219 పరుగులు చేసింది. ఇషాన్ కిషన్(81), తిలక్ వర్మ(60లి) హాఫ్ సెంచరీలతో చెలరేగారు.



# తలొగ్గిన మోదీ అధికారం

భారత రాజకీయ చరిత్రలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు ఎన్నికల్లో ఓటమి చెందడం, ప్రతిపక్షాల ఒత్తిడికి తలవంచడం, న్యాయస్థానాల జోక్యంతో నిర్ణయాలు మార్చుకోవడం వంటి సంఘటనలు ఎన్నో జరిగాయి. కానీ సోషల్ మీడియాలో వ్యంగ్యంగా ప్రారంభమైన ఒక యువజన ఉద్యమం దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులను, నిరుద్యోగ యువతను ఏకం చేసి, చివరకు కేంద్ర ప్రభుత్వాన్ని చర్చల బల్లపైకి తీసుకురావడం, తమ ప్రధాన డిమాండ్లను అంగీకరించే పరిస్థితి తీసుకురావడం ఇటీవలి భారత రాజకీయాల్లో అత్యంత విశేషమైన పరిణామంగా నిలిచింది. "కాక్రోచ్ జనతా పార్టీ " పేరుతో ప్రారంభమైన ఈ ఉద్యమం కేవలం ఒక వైరల్ ప్రచారం కాదు. యువతలో పేరుకుపోయిన అసంతృప్తి, నిరుద్యోగం, పరీక్షల అవకతవకలు, ప్రభుత్వ జవాబుదారీతనం వంటి అంశాలపై వ్యక్తమైన సామూహిక రాజకీయ స్పందనగా అనేక జాతీయ, అంతర్జాతీయ మీడియా సంస్థలు విశ్లేషించాయి. ఈ ఉద్యమానికి మూలం ఒక వ్యంగ్య వ్యాఖ్య. "కాక్రోచ్" అనే పదాన్ని అవమానకరంగా ఉపయోగించిన సందర్భాన్ని యువత తమ ఆత్మగౌరవ చిహ్నంగా మార్చుకుంది.

11లో..

## ప్రభుత్వ మెడలు వంచిన కాక్రోచ్ జనతా పార్టీ



ప్రజాస్వామ్యం గెలిచింది... విద్యార్థుల సామూహిక సంకల్ప విజయమిది

అభిజీత్ దీప్కే

# ఎట్టకేలకు ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. నీట్ పేపర్ లీకేజీ అంశం నేపథ్యంలో ఆయన తన రాజీనామాను సమర్పిం చారు. కాక్రోచ్ జనతా పార్టీ దేశవ్యా ప్తంగా ప్రధాన్ రాజీనామా కోరుతూ ఆందోళనలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే అని పార్లమెం ట్‌లో విపక్ష పార్టీలు కూడా డిమాండ్ చేశాయి. పార్ల మెంట్ సమావేశాలను గత వారం నుంచి విపక్షాలు ఈ అంశంపైనే స్తంభింప చేశాయి.జూలై 20వ తేదీన కాక్రోచ్ జనతా పార్టీ నిర్వహించిన చలో పార్లమెం ట్ హింసాత్మకంగా మారడంతో.. విపక్షా లు కూడా తమ గళాన్ని తీవ్రం చేశాయి. విద్యార్థి లోకంతో పాటు విపక్షాలు కూడా డిమాండ్ చేయడం తో.. మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చివరకు ఇవాళ తన రాజీనా మాను సమర్పిం చారు. ధర్మేంద్ర ప్రధాన్ తన ఎక్స్ అకౌంట్‌లో .. హిందీ భాషలో ఓ లేఖను రిలీజ్ చేశారు.



7లో..

## ఆందోళన విరమిస్తున్నామని ప్రకటించిన కాక్రోచ్ జనతా పార్టీ

## యువత ఆశయాలు,ఆకాంక్షలను గౌరవిస్తున్నా : ధర్మేంద్ర ప్రధాన్

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. ఆయన తన రాజీనామా లేఖను ఎక్స్‌లో పోస్టు చేశారు. దాంట్లో ఏం రాశారంటే.. గత 10 రోజుల నుంచి జరుగుతున్న పరిణామాలను తనను బాధకు గురిచేసినట్లు మంత్రి ప్రధాన్ పేర్కొన్నారు. ఇది నా వ్యక్తిగత ప్రతిష్టకు చెందిన విషయం కాదు అని అన్నారు. భారత యువశక్తియే ఈ దేశానికి అసలైన శక్తి అని అన్నారు. దేశ యువశక్తిని భ్రమలో పడకుండా చూస్తానన్నారు. ఇదే తన సంకల్పం అని మంత్రి పేర్కొన్నారు.

## ఆందోళన విరమిస్తున్నాం

### ప్రకటించిన కాక్రోచ్ జనతా పార్టీ



కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్‌లతో తాజా సమావేశం అనంతరం కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ప్రతినిధు లు తమ ఆందోళనను విరమిస్తున్నామని ప్రకటించారు. జంతర్ మంతర్ నుంచి విద్యార్థులు, యువత తిరిగి వెళ్లాలని కోరారు. మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో తమకు తొలి విజయం దక్కిందని అన్నారు. నిరసనల సందర్భంగా విద్యార్థులపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లను ఎత్తేసేందుకు కేంద్రం అంగీకరించిందని అన్నారు. నీట్ పేపర్ లీక్ బాధిత కుటుంబాలకు రూ.1 కోటి పరిమారం ఇవ్వాలన్న డిమాండ్‌కు కేంద్రం సానుకూలంగా స్పందించిందని అన్నారు. తాము ఆశించిన చర్యలను కేంద్రం త్వరిత గతిన తీసుకుంటుందన్న విశ్వాసంతో ఆందోళనను విరమిస్తున్నామని అన్నారు.సీజేపీ ప్రతినిధులతో కలిసి మీడియా సమావేశంలో పాల్గొన్న కేంద్ర మంత్రి జేపీ నడ్డా వారితో సుదీర్ఘం గా చర్చించామని అన్నారు. నీట్ ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులపై కేసులు ఎత్తేస్తామని చెప్పారు. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థులకు నిబంధనలకు లోబడి పరిహారం ఇస్తామని చెప్పారు.

## ధర్మేంద్ర రాజీనామాకు రాష్ట్రపతి ఆమోదం..

### విద్యాశాఖ మంత్రిగా ప్రహ్లాద్ జోషికి అదనపు బాధ్యతలు



**ఢిల్లీ:** కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవి నుంచి తప్పుకొంటూ ధర్మేంద్ర ప్రధాన్ సమర్పించిన రాజీనామాను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శనివారం ఆమోదించారు. ప్రధాని సూచన మేరకు రాష్ట్రపతి.. ధర్మేంద్ర రాజీనామాకు ఆమోదం తెలిపారు. ఇదే సమయంలో కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి విద్యాశాఖ మంత్రిగా అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నట్లు రాష్ట్రపతి ఒకప్రక టనలో పేర్కొన్నారు. ధర్మేంద్ర రాజీనామా నేపథ్యంలో ఆయనకు విద్యాశాఖ అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రధాని మోదీ నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం ప్రహ్లాద్ జోషికి ఉన్న శాఖలతోపాటు విద్యా శాఖను కూడా ఆయన పర్యవేక్షిస్తారు. ప్రస్తుతం ప్రహ్లాద్ జోషి.. విని యోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ, పునరుత్పాదక ఇంధన వనరుల శాఖల కు మంత్రిగా కొనసాగుతున్నారు. అలాగే, ఇంటర్నేషనల్ సోలార్ అలయ న్స్‌కు ప్రెసిడెంట్ గా కొనసాగుతున్నారు. తాజా రాజకీయ పరిణామాలు విద్యా వ్యవస్థతో పాటు పరీక్షల నిర్వ హణలో మార్పులకు దోహదం చేస్తాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రహ్లాద్ జోషి కర్ణాట కలోని ధార్వాడ్ నుంచి ఎంపీగా గెలుపొందారు. ఇక, ప్రస్తుత పరిస్థి తుల్లో విద్యాశాఖ మంత్రిగా ప్రహ్లాద్ జోషి కీలక బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుంది.

## విద్యార్థుల విజయాన్ని మా ఖాతాలో వేసుకోం : సీఎం రేవంత్

**హైదరాబాద్, జులై 25:** విద్యార్థుల పోరాటం ఫలితంగానే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసుల లాఠీచార్జీని ఖండిస్తూ పీపుల్స్ ప్లాజా నుంచి ఇందిరా గాంధీ విగ్రహం వరకూ క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ విద్యార్థులపై నమోదైన కేసులను వెంటనే తొలగించాలని, వారి విజయాన్ని కాంగ్రెస్ ఖాతాలో వేసుకోబోమని స్పష్టం చేశారు. విద్యార్థులపై పెట్టిన కేసులను వెంటనే తొలగించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పార్లమెంట్‌లో కాంగ్రెస్ ఎంపీలంతా ఇదే నినాదాన్ని వినిపించాలని సూచించారు. విద్యార్థుల పోరాటం వల్లే కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేశారని, ఇది యువత సాధించిన విజయమని అన్నారు.విద్యార్థుల మొహాల్లో కనిపిస్తున్న ఆనందమే అసలైన విజయమని



సీఎం రేవంత్ పేర్కొన్నారు. చప్పన్ ఇంచ్ ఛాతీ అంటూ గొప్పలు చెప్పుకునే నాయకత్వం.. దేశ యువత ముందు ఓడిపోయిందని విమర్శించారు. అయితే విద్యార్థులపై నమోదైన కేసులు ఇంకా తొలగించలేదని, వెంటనే వాటిని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. నీట్ కారణంగా ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పరామర్శించలేదని ఆరోపించారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించే వరకూ వారి తరఫున కాంగ్రెస్ పోరాటం కొనసాగిస్తుందని సీఎం స్పష్టం చేశారు.

# చట్టవ్యతిరేక కార్యకలాపాలపై ఉక్కుపాదం

## జైపూర్ ఏసిపి వెంకటేశ్వర్లు

## ఎసన్వాయిలో పోలీసుల ఆకస్మిక తనిఖీలు

**వాస్తవం : చెన్నూర్ ఆర్సీ**

జైపూర్ ఏసిపి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎక్సైజ్ అధికారులు సమన్వయంతో శనివారం తెల్లవారుజామున కోటపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎసన్వాయి గ్రామంలో ఆకస్మికంగా కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటిని తనిఖీ చేస్తూ నివాసితుల వివరాలను సేకరించారు. గ్రామంలోకి కొత్త వ్యక్తులు ఎవరైనా వచ్చారా లేదా అనుమానాస్పద వ్యక్తులు తలదాచుకుంటున్నారా అనే కోణంలో విస్తృతంగా సోదాలు నిర్వహించి, సరైన ధ్రువపత్రాలు లేని 30 ద్విచక్ర వాహనాలు మరియు 5 ఆటోలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏసిపి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజలలో భద్రతా భావాన్ని పెంపొందించడం, నేరస్తుల కదలికలపై నిఘా ఉంచడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించిన ఆయన, ముఖ్యంగా అరైవ్ అలైవ్ ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో భాగంగా రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపడం, అతి వేగం వంటి నిర్లక్ష్యపు చర్యల వల్ల కుటుంబాలు వీధిన పడుతున్నాయని, హెల్మెట్ మరియు సీట్‌బెల్ట్ ధరించడం వల్ల ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చని ఆయన ఉదాహరణలతో వివరించారు. అనంతరం, గ్రామంలోని గుడుంబా ప్రభావిత



ప్రాంతాలపై ఎక్సైజ్ పోలీసులు సివిల్ పోలీసులు మెరుపు దాడులు నిర్వహించి, సుమారు 1000 లీటర్ల బెల్లపు పానకాన్ని అక్కడికక్కడే ధ్వంసం చేశారు. అలాగే 30 లీటర్ల నిషిద్ధ గుడుంబాను స్వాధీనం చేసుకుని, దాని తయారీ మరియు విక్రయాలకు పాల్పడుతున్న 9మంది వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు చెన్నూర్ ఎక్సైజ్ సీఐ హరి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో చెన్నూరు రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆర్ .కృష్ణ , ఎక్సైజ్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిండెంట్ శ్రీరామ్ రెడ్డి ట్రైనీ ఎక్సైజ్ సీఐలు సమ్మయ్య,అక్బర్ హుస్సేన్ , కోటపల్లి ఎస్సై , నిల్వాయి ఎస్ఐ, ఎక్సైజ్ ఎస్ఐ రమణ మరియు ఎక్సైజ్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### స్వర్గీయ నాయిని విశాల్ రెడ్డి జన్మదినం సందర్భంగా

# అంధుల పాఠశాలలో సేవా కార్యక్రమం



**వాస్తవం : హన్మకొండ**

వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కుమారుడు స్వర్గీయ నాయిని విశాల్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని హనుమకొండలోని లోహి ఆదర్శ అంధుల పాఠశాలలో సేవా కార్యక్రమం నిర్వహించారు. వరంగల్ పార్లమెంట్ సోషల్ మీడియా కన్వీనర్ నేహాల్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆప్యాయంగా ముచ్చటించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి చేయూత అందించడం గొప్ప నివాళి అని పేర్కొన్నారు. విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ వారు విద్యలో మరింత రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దీపక్ రెడ్డి, భరత్ తదితరులు పాల్గొన్నారు.

### స్వగృహాలో ఖాళీగా ఉన్న గదులను

# ఇందిరమ్మ ఇండ్లకు కేటాయించండి

**సీపీఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్**

**వాస్తవం : కుత్బుల్లాపూర్ ఆర్సీ :**



రేవంత్ రెడ్డి ప్రభుత్వం క్యూర్ రీజియన్ లో నివసిస్తున్న ప్రజల కొరకు ఇందిరమ్మ ఇండ్ల పేరుతో చేపట్టిన ప్రభుత్వ పథకం మంచిదని కానీ ఆచరణలో ఇలాంటివి పేద ప్రజలకు అంతగా ఉపయోగపడట్లేదు కాబట్టి పేద ప్రజల నుంచి డబ్బులను ఆశించే బదులు గ్రేటర్ హైదరాబాద్ ని మేడ్చల్ జిల్లా పరిధిలో గతంలో నిర్మించబడి ఎవరికీ కేటాయించని వాంబే గృహాలు, రాజీవ్ స్వగృహ గృహాలు లో అనేక వేల ఇండ్లు కాలిగా ఉన్నాయని వాటిని ప్రభుత్వం ఇచ్చే ఐదు లక్షల తోటి మొత్తం నిర్మించవచ్చని కావున అలాంటి ఎవరికి కేటాయించబడనీ గృహాలను గుర్తించి వెంటనే అర్హులకు కేటాయించాలని సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ డిమాండ్ చేశారు.నేడు సిపిఐ కుత్బుల్లాపూర్ మండల నాయకత్వంలో గాజులరామారంలోని సర్వే నెంబర్ 79లో నిర్మించి ఉన్న రాజీవ్ స్వగృహాలను సందర్శనలో భాగంగా అక్కడ నిర్మాణం పూర్తయి ఎవరికి కేటాయించకుండా ఉన్న గృహాలను మరియు నిర్మాణం కాని వాటిని పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా వారు ప్రభుత్వాన్ని జిల్లాలో ఇలా నిర్మించబడి ఎవరికీ కేటాయించని గృహాలు సుమారు మూడు నాలుగు వేలు ఉండవచ్చని వాటిని గుర్తించి పేద ప్రజలకు కేటాయించాలని కోరారు. అదేవిధంగా మేడ్చల్ జిల్లాలో ప్రభుత్వ భూమిని హెచ్ఎండిఏకి అప్పగించి ఊరుకుండడం వల్ల వేలాది ఎకరాలు అన్యక్రాంతమయ్యాయని అటువంటి భూములను గుర్తించి పేద ప్రజలకు పంచాలని డిమాండ్ చేశారు. ఒకవేళ పంచని పక్షంలో కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ప్రజలను సమీకరించి మరో భూ పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మహేష్ మండల కార్యదర్శి స్వామి సహాయ కార్యదర్శులు హరినాథ్ రావు రాములు, కోశాధికారి సదానంద్, ప్రజానాట్యమండలి అధ్యక్షులు బాబు సీపీఐ నాయకులు మల్లేష్ రమేష్ ఇమామ్ సహదేవరెడ్డి యువజన సంఘం నాయకులు ప్రవీణ్ కీర్తి వంశీ పాల్గొన్నారు.

# రాష్ట్ర సుభిక్షం కోసం

# వేయి స్తంభాల గుడిలో శత, సహస్రశత కటాభిషేకం

**పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**





**వాస్తవం : హన్మకొండ**

హనుమకొండ జిల్లా వరంగల్‌లోని ప్రముఖ వేయి స్తంభాల దేవాలయంలో రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కుటుంబ సమేతంగా శత, సహస్ర శత కటాభిషేక మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరు కున్న ఎమ్మెల్యే నాయినికి ఆలయ అధికారులు, ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్ర శర్మ పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. తొలుత శ్రీ గణపతిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయన, అనంతరం రుద్రేశ్వర స్వామి వారికి అభిషేకం చేసి ప్రత్యేక అర్చనలు చేశారు. తర్వాత ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన శత, సహస్రశత కటాభిషేక పూజా కార్యక్ర మంలో కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యా ప్తంగా సమృద్ధిగా వర్షాలు కురిసి చెరువులు, కుంటలు, జలాశయాలు నిండాలని ఆకాంక్షించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంటలు సమృద్ధిగా పండా లని, వ్యవసాయం, పాడి పరిశ్రమ మరింత అభివృద్ధి చెందాలని కోరుకున్నారు. రాష్ట్ర ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో జీవించాలని భగవంతుడిని ప్రార్థించి నట్లు తెలిపారు. పూజా కార్యక్రమం అనంతరం ఆలయ వేద పండితులు ఎమ్మెల్యే దంపతులకు వేదాశీర్వచనం అందించి తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తిశ్రద్ధల మధ్య జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, ప్రజాప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### శివ్వారం తాగు నీటి పైపులైను వేలంపై

# విచారణ చేపట్టిన అదనపు కలెక్టర్

**వాస్తవం : జైపూర్,జూలై 25**

జైపూర్ మండలంలోని శివ్వారం గ్రామ పంచాయతీ నందు తాగు నీటి కోసం గోదావరి నది నుండి ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ పైపులైను పైపుల ను సర్పంచ్ అక్రమంగా వేలం వేశారని ఫిర్యాదులు వచ్చినందున మంచిర్యాల జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), మంచిర్యాల విచారణ చేపట్టారు. గ్రామ పంచాయతీని సందర్శించి గోదావరి ఒడ్డున ఉన్న పైపులైన్‌ను పరిశీలించి ఈ విషయమై అధికారులు, సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు మరియు గ్రామ ప్రజల సమక్షంలో ఈ పైపులైన్ ఎవరు వాడకూడదు అని తెలిపారు. విచారణకు జిల్లా పంచాయతీ అధికారి డి.వెంకటేశ్వర రావు , ఈఈ ఆర్ డబ్ల్యూ ఎస్ (మి షన్ భగీరథ) వెంకటేశ్వర్ , డీవై .ఈఈ ఆర్ డబ్ల్యూ ఎస్ కిరణ్, ఎంపీ డీవో జి.సత్యనారాయణ, ఎంపీఓ శ్రీపతి బాపు రావు, ఏఈ ఆర్ డబ్ల్యూ ఎస్ ఎన్ . రాజ మల్లయ్య, సర్పంచ్ అంజన్ గౌడ్ , వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి సృజన, గ్రామ పెద్దలు చల్లా విశ్వంబర్ రెడ్డి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# నీట్ లీకేజీపై సమగ్ర విచారణ జరపాలి

**ప్రొఫెసర్ డా. కూరపాటి రమేష్**



**వాస్తవం : హన్మకొండ**

దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళనకు దారితీసిన నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంపై సమగ్ర, నిష్పక్షపాత విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని బీసీ ఇంటెలెక్చువల్స్ ఫోరం రాష్ట్ర కార్యదర్శి ప్రొఫెసర్ డా. కూరపాటి రమేష్ డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే ప్రవేశ పరీక్షల్లో జరిగిన నిర్లక్ష్యం అత్యంత బాధాకరమని ఆయన పేర్కొన్నారు. ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ సంబంధిత కేంద్ర మంత్రిని వెంటనే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజల గొంతును అణచివేయడం కాకుండా వారి ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రభుత్వం నాయకుల కోసం కాకుండా ప్రజల ప్రయోజనాల కోసం పనిచేసే విధంగా వ్యవహరించాలని సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పరీక్షల నిర్వహణలో పారదర్శకత, భద్రతను మరింత పటిష్టం చేయాలని కోరారు. విద్యార్థులు, తల్లిదండ్రుల్లో విశ్వాసాన్ని పునరుద్ధరించేలా పరీక్షల నిర్వహణ వ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావాలని అన్నారు. ప్రస్తుతం ఉన్న ఎన్‌టీఏ వ్యవస్థను రద్దు చేసి, యూపీఎస్సీ తరహాలో స్వయం ప్రతిపత్తి కలిగిన కేంద్ర స్థాయి సంస్థకు నీట్ నిర్వహణ బాధ్యతలు అప్పగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. విద్యా వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం నిలబెట్టేందుకు కేంద్రం తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. బీసీ ఇంటెలెక్చువల్స్ ఫోరం ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో డా. కొణతం కృష్ణ, ప్రో. బెనర్జీ, దారం జనార్ధన్, ధనలక్ష్మి, దేవిక, ప్రో. అంజయ్య, కొలిపాక ప్రకాష్, నగేష్, దొమ్మటి ప్రవీణ్ కుమార్, రవితేజ, నిరంజన్ తదితర రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

### మంచిర్యాల జిల్లాలో

# మరో కొత్త స్వచ్ఛంద సేవా సంస్థ సేవలకు శ్రీకారం

**వాస్తవం : చెన్నూర్ ఆర్సీ**

చెన్నూర్ పట్టణంలో లయన్స్ క్లబ్ ఆఫ్ రామగుండం ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ ఆఫ్ చెన్నూర్ విశాఖ నూతన క్లబ్‌ను ఘనంగా ప్రారంభించారు.చెన్నూర్ పట్టణంలోని మైనార్టీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ రామగుండం ప్రతినిధులు, స్థానిక ప్రముఖులు, సేవాభావం కలిగిన సభ్యులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ చెన్నూర్ విశాఖ తొలి కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.సంస్థ తొలి అధ్యక్షుడిగా తారాచంద్ దేవుడా, కార్యదర్శిగా మొహమ్మద్ జైనుల్, కోశాధికారిగా చెరుకు తిరుపతిరెడ్డి బాధ్యతలు స్వీకరించారు.వీరితో పాటు 20 మంది సభ్యులతో నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు.ప్రజా సేవే లక్ష్యంగా విద్య, వైద్యం, పర్యావరణ పరిరక్షణ, రక్త దాన శిబిరాలు, సామాజిక సేవా కార్యక్ర మాలను విస్తృతంగా నిర్వహిస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు.సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి అండగా నిలుస్తూ చెన్నూర్ ప్రాంతంలో ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపడ తామని లయన్స్ క్లబ్ ఆఫ్ చెన్నూర్ విశాఖ నూతన కార్యవర్గం స్పష్టం చేసింది.



# భూపాలపల్లిలో ఘనంగా ఎర్ర సత్యం జయంతి

**తెలంగాణ రాజ్యాధికార పార్టీ**

**వాస్తవం : భూపాలపల్లి**



తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో బీసీ ముదిరాజ్ ముద్దుబిడ్డ, పోరాట యోధుడు ఎర్ర సత్యం జయంతి వేడుకలను జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నాయకులతో కలిసి ఎర్ర సత్యం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ మాట్లాడుతూ, ఎర్ర సత్యం తన జీవితాన్ని పేద ప్రజల సేవకే అంకితం చేశారని కొనియాడారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల అభ్యున్నతి కోసం ఆయన నిరంతరం కృషి చేశారన్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ ప్రాంతాల్లో ప్రజల ఆదరణ పొందిన గొప్ప నాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్నారని గుర్తుచేశారు. ఇంతటి ప్రజాదరణ ఉన్న నాయకుడిని కొందరు వ్యక్తులు కక్షపూరిత ధోరణితో నిర్దాక్షిణ్యంగా హత్య చేయడం అత్యంత బాధాకరమని రవి పటేల్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎర్ర సత్యం ఆశయాలు, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన పోరాటాన్ని తెలంగాణ రాజ్యాధికార పార్టీ ముందుకు తీసుకెళ్తుందని స్పష్టం చేశారు. అందులో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా ఆయన జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీ పిట్టల వెంకటేష్, మహిళా విభాగం అధ్యక్షురాలు సామల శ్రీలత, క్రమశిక్షణ కమిటీ నాయకుడు కరుణాకర్ పాల్గొన్నారు. వారితో పాటు కార్మిక విభాగం నాయకుడు అనంతుల సంపత్, ఎలక్ట్రిషియన్ విభాగం నాయకుడు అశోక్, జిల్లా నాయకులు సమ్మయ్య, రాంబాబు, సలీం, రమేష్, విజయ్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

# విద్యార్థినికి యూనివర్సల్ బుక్ ఆఫ్ గోల్డెన్ రికార్డ్స్ ప్రశంస పత్రం




**వాస్తవం : చందుర్తి**

చందుర్తి మండల కేంద్రానికి చెందిన ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ విద్యార్థిని శ్రీరాం శ్రీహిత 2026 సంవత్సర ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి 468/470 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో విశిష్ట స్థానం సంపాదించారు.విద్యార్థిని సాధించిన ఈ అసాధారణ విజయాన్ని గుర్తించిన యూనివర్సల్ బుక్ ఆఫ్ గోల్డెన్ రికార్డ్స్ హైదరాబాద్ సంస్థ ఆమెకు ప్రత్యేక ప్రశంసా పత్రం అందజేసి ఘనంగా సత్కరించారు. అంతేకాకుండా విద్యార్థిని విజయానికి కృషి చేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాల, చందుర్తి ప్రిన్సిపాల్ యం విజయ లక్ష్మి కి కూడా ప్రశంసా పత్రాన్ని అందజేసి వారి సేవలను అభినందించింది.ఈ సందర్భంగా కళాశాల అధ్యాపక బృందం విద్యార్థిని సాధించిన విజయానికి హర్షం వ్యక్తం చేస్తూ, ఆమెను అభినందించారు. విద్యార్థిని విజయానికి తోడ్పడిన తల్లిదండ్రులను కూడా ప్రత్యేకంగా అభినందిస్తూ, వారి సహకారాన్ని ప్రశంసించారు.కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులు కూడా కృషి, పట్టుదల, క్రమశిక్షణతో రాష్ట్ర స్థాయిలో విశిష్ట విజయాలు సాధించగలరని శ్రీరాం శ్రీహిత నిరూపించిందని పేర్కొన్నారు. బఆమె మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# అర్హులైన ప్రతీ ఒక్కరూ ఓటరుగా నమోదు చేయించుకోవాలి



**యలమంచి ఉదయ్ కిరణ్**

**వాస్తవం : శేర్లింగంపల్లి:**

మియాపూర్: భారత ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా, యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు , చైర్మన్, మియాపూర్ డివిజన్ జనరల్ సెక్రటరీ యలమంచి ఉదయ్ కిరణ్ మియాపూర్--మక్త డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించి కార్యక్రమం అమలు తీరును ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. మియాపూర్--మక్త డివిజన్ పరిధిలోని ప్రగతి ఎన్క్లేవ్,ఆర్బిఆర్, జనప్రియ వెస్ట్ సిటీ, ప్రజయ షెల్టర్స్, బీకే ఎంక్లేవ్, మక్త, జేపీ నగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించిన యలమంచి ఉదయ్ కిరణ్ బీఎల్ఓలు, బీఎల్ఏలు, స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు కాలనీ వాసులతో కలిసి సార్ కార్యక్రమ పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజల నుంచి వివరాలను తెలుసుకుని, ఓటరు నమోదు మరియు ధృవీకరణ ప్రక్రియ సజావుగా కొనసాగుతున్న తీరును పరిశీలించారు.ఈ సందర్భంగా యలమంచి ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ, ప్రతి అర్హత కలిగిన పౌరుడు తమ ఓటరు నమోదు వివరాలను తప్పనిసరిగా పరిశీలించుకోవాలని, ఓటరు జాబితాలో తమ పేరు సక్రమంగా నమోదై ఉందో లేదో నిర్ధారించుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో ప్రతి ఓటరు బాధ్యతాయుతంగా భాగస్వామి కావాలని, ఓటరు జాబితా సవరణ ప్రక్రియను నిర్లక్ష్యం చేయకుండా నిర్ణీత గడువులో పూర్తి చేసుకోవాలని పిలుపునిచ్చారు.అదేవిధంగా, ఎన్యూమరేషన్ ఫారమ్‌ను ఆన్‌లైన్‌లో కూడా సులభంగా సమర్పించవచ్చని ప్రజలకు వివరించారు. ఫారమ్‌ను ఎలా పూరించాలి, నమోదు, ధృవీకరణ ప్రక్రియను ఎలా పూర్తి చేయాలి అనే అంశాలపై ప్రజలకు దశలవారీగా అవగాహన కల్పించారు. ప్రతి అర్హత కలిగిన ఓటరు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ నమోదు ప్రక్రియను పూర్తి చేసుకునేలా అవసరమైన మార్గనిర్దేశం మరియు సహకారం అందించారు.అర్హత కలిగిన ప్రతి ఓటరు తమ నమోదు, ధృవీకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసుకునేలా అవసరమైన సహాయ సహకారాలు అందించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రక్రియను సజావుగా పూర్తి చేయడానికి సహకరించాలని బీఎల్ఓలకు యలమంచి ఉదయ్ కిరణ్ సూచించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ చురుకుగా పాల్గొని తమ వివరాలను సరిచూసుకోవడం ద్వారా ప్రజాస్వామ్య హక్కును మరింత పటిష్టంగా కాపాడుకోవచ్చని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు తమ ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకునేలా అవసరమైన అవగాహన కల్పించడం, సహకారం అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో రావిపాటి వెంకటేశ్వరరావు , శంకర్ చారి, మహేశ్వర్, గోవర్ధన్, ఐన రెడ్డి,శ్రీకాంత్, సదానందం, గోపాల కృష్ణ, విజయ లక్ష్మి, వెంకటేశ్వరరావు, రామకృష్ణ, శరత్, మధు, రాధాకృష్ణ, సతీష్, ప్రవీణ్, వంశీ, రత్నాచారి, రామ్, శశి తదితరులతో పాటు పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అఖండ భజన కార్యక్రమంలో ఆది శ్రీనివాస్



**వాస్తవం : చందుర్తి**

చందుర్తి మండల కేంద్రంలోని శ్రీ మహాలక్ష్మి ఆలయంలో తొలి ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని సాదు సజ్జన భజన మండలి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించే అఖండ భజన కార్యక్రమంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.... చందుర్తి మండల కేంద్రంలో గత 22 సంవత్సరాల నుండి తొలి ఏకాదశి సందర్భంగా అఖండ భజన కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు.అమ్మవారి ఆశీస్సులతో వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు పండి. ప్రజలందరు ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ చందుర్తి మండల శాఖ అధ్యక్షులు గొట్టె ప్రభాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి చింతపంటి రామస్వామి, మాజీ జెడ్పిటి సభ్యులు నాగం కుమార్,పార్టీ నాయకులు సంతపురి బాల్ రెడ్డి, దూది శ్రీనివాసరెడ్డి, బొజ్జ మల్లేశం, వేల్పుల దేవస్వామి, పులి సత్యం గౌడ్, తదితరులు, సాధుసజ్జన భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ సంక్షేమ సంఘం
Red 914/2015
జర్నలిస్ట్ సంక్షేమమే పరమావధిగా
జర్నలిస్ట్ హక్కుల కోసం....
వాళ్ళ ప్రగతి కోసం... పత్రికా స్వేచ్ఛ కోసం...
సభ్యత్వ నమోదు కోసం సంప్రదించండి సెల్ నెం॥ 9618616110

## సూరారం శివారులో

# పేకాట స్థావరంపై పోలీసుల దాడి

**17 మంది జూదరుల అరెస్ట్**

**రూ. 1.96 లక్షల నగదు, 4 కార్లు, బైక్, 19 ఫోన్లు స్వాధీనం**

**ఫంక్షన్ హాల్ యజమానితో సహా 18 మందిపై కేసు నమోదు**



**వాస్తవం : ఎల్కతుర్తి**

ఎల్కతుర్తి మండల పరిధిలోని సూరారం గ్రామ శివారులో రిలయన్స్ గ్యాస్ ప్లాంట్ సమీపంలో నిర్మాణంలో ఉన్న ఒక ఫంక్షన్ హాల్‌పై పోలీసులు అకస్మాత్తుగా మెరుపు దాడి చేసి, రహస్యంగా సాగుతున్న భారీ పేకాట రాకెట్‌ను గుట్టురట్టు చేశారు. ఈ దాడిలో 17 మంది పేకాటరాయుళ్లను పట్టుకోగా, అక్రమ కార్యకలాపాలకు వేదికగా నిలిచిన ఫంక్షన్ హాల్ యజమానితో కలిపి మొత్తం 18 మందిపై కేసు నమోదు చేశారు.పక్కా నిఘా సమాచారంతో రాత్రి 8 గంటల సమయంలో సిబ్బందితో కలిసి ఫంక్షన్ హాల్‌పై రైడ్ నిర్వహించిన పోలీసులు, సంఘటనా స్థలం నుండి భారీగా సొత్తును స్వాధీనం చేసుకున్నారు . పెండ్యాల సుధాకర్ ,గంగిశెట్టి రాజు, దామెర రమేష్ కుమార్ ,వావిలాల వేణుగోపాల్ ప్రసాద్,కంకణాలకరు ణాకర్ రెడ్డి, సూరం దామోదర్ రెడ్డి , సూరం రాజు ,వెన్నం సింగారెడ్డి , అబిడి సంతోష్ ,బైరు వినయ్ కుమార్ రెడ్డి , కేసిరెడ్డి వివేకానంద రెడ్డి , అలువోజు సంపూర్ణాచారి , పసుల సురేష్ ,కొక్కిరాల రవీందర్,సజ్జల మనోహర్, గరిక రంజిత్ కుమార్,గుగులోత్ భద్రుసింగ్ వీరితో పాటు, అసాంఘిక కార్యకలాపాలకు స్థలాన్ని కేటాయించినందుకు గాను ఫంక్షన్ హాల్ యజమాని శ్రీనివాస్ పై కూడా చట్టరీత్యా కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు జరుపుతున్నారు.గ్రామీణ లేదా శివారు ప్రాంతాలలో నిర్మానుష్య ప్రదేశాలను ఆసరాగా చేసుకుని పేకాట, వంటి అక్రమ స్థావరాలు నిర్వహిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. అక్రమ కార్యకలాపాలకు స్థలాలు ఇచ్చే భవన యజమానులపై కూడా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

## బీరన్న గుడిలో

# ఘనంగా బోనాల ఉత్సవం

**పాడిపంటలు సమృద్ధిగా పండాలని ప్రత్యేక పూజలు**

**మొక్కులు తీర్చుకున్న గొల్లకురుమ మహిళలు**



**వాస్తవం : ఎల్కతుర్తి**

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని గొల్లకురుమల ఆరాధ్య దైవమైన బీరన్న గుడిలో శనివారం భక్తిశ్రద్ధలతో బోనాల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని బోనాలు, యాటలను సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.ప్రతి సంవత్సరం నిర్వహించే సంప్రదాయం ప్రకారం ఈ ఏడాది కూడా ప్రత్యేక పూజలు నిర్వహించి, రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులకు పాడిపంటలు బాగా పండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని బీరన్న స్వామిని వేడుకున్నారు. భక్తుల జైజైధ్వానాలు, సంప్రదాయ పూజా కార్యక్రమాల మధ్య ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది.ఈ సందర్భంగా ఆలయ పూజారి గోపి బిక్షపతి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో కుల పెద్దలు, సంఘం అధ్యక్షుడు అల్లి సమ్మయ్య, గడ్డం రవి, కడారి వెంకన్న, కడారి రవి, ఐత శ్రీనివాస్, కోరి రాజ్‌కుమార్, కడారి సురేందర్, అల్లి కుమార్, ముద్రపోయిన మల్లయ్య, పాక రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ పశుపతినాథుని ఆలయంలో

# తొలి ఏకాదశి ఆధ్యాత్మిక శోభ

**వర్షాలు సమృద్ధిగా కురవాలని పశుపతినాథునికి విశేష అభిషేకాలు**

**వాస్తవం : ఎల్కతుర్తి**



హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని వల్లభాపురం గ్రామంలో వెలసిన ప్రసిద్ధ శ్రీ పశుపతినాథ్ దేవస్థానంలో తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం పవిత్ర ఆధ్యాత్మిక వాతావరణంలో విశేష పూజా కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా దేవాలయం భక్తుల హరహర మహాదేవ నామస్మరణతో మారుమోగింది.పర్వదినాన్ని పురస్కరించుకుని తెల్లవారుజాము నుంచే వల్లభాపురంతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు సదానిరంజన్ సిద్ధాంతి ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చారణల నడుమ స్వామివారికి పంచామృత రుద్రాభిషేకాలు, బిల్వార్చన మరియు సామూహిక అర్చనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేసి, అర్చకులు ప్రత్యేక వేదాశీర్వచనాలు అందజేశారు. “తొలి ఏకాదశి పర్వదినాన పరమ శివుడిని భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తే ఆయురారోగ్యాలు, సుఖశాంతులు లభిస్తాయి. రాష్ట్రంలో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, పంటలు బాగా పండి రైతులందరూ సుభిక్షంగా ఉండాలని ఆ పశుపతినాథ స్వామివారిని ప్రత్యేకంగా ప్రార్థించాం.” అని సదానిరంజన్ సిద్ధాంతి, ఆలయ అర్చకులు అన్నారు. ఈ ఆధ్యాత్మిక వేడుకల్లో ఆలయ కమిటీ చైర్మన్ భావన ఋషి, ప్రతినిధులు కోడం రమేష్, దగ్గు వెంకటేశ్వరరావు, ఉడుత నరసన్న, ఆంధ్రప్రభ ప్రవీణ్, రాకేష్, మహేందర్, తరుణ్, ఠాగూర్, రంజాన్, శ్రీనివాస్, సుశాంత్లతో పాటు విజయ, మమత, సౌందర్య, పూజ, ఆద్విక, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు మరియు యువ కులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులందరూ స్వామి వారిని దర్శించుకున్నారు.

## ద్రోణ స్కూల్లో

# ఘనంగా కార్గిల్ విజయ్ దివాస్ వేడుకలు



**వాస్తవం : లక్ష్మణ చందా**

లక్ష్మణ్ చందా గ్రామంలోని ద్రోణ స్కూల్లో కార్గిల్ విజయ్ దివాస్ వేడుకలు జరుపుకోవడం జరిగింది స్కూల్ ప్రిన్సిపాల్ గారు మాట్లాడుతూ 1999లో జరిగిన కార్గిల్ యుద్ధంలో భారత సైనికులు అపూర్వమైన ధైర్యసాహసాలు ప్రదర్శించి శత్రువులను తరిమికొట్టి దేశ గౌరవాన్ని నిలబెట్టారు. వారి వీరోచిత పోరాటానికి గుర్తుగా ప్రతి సంవత్సరం జూలై 26న కార్గిల్ విజయ్ దివాస్ నిర్వహించడం జరుగుతుందని వివరించారు.ఈ సందర్భంగా దేశం కోసం తమ ప్రాణాలను అర్పించిన అమర వీర జవాన్లకు ఘన నివాళులు అర్పించారు. వారి త్యాగం, దేశభక్తి, సేవాస్ఫూర్తి ప్రతి భారతీయుడికి స్ఫూర్తిదాయకం కావాలని విద్యార్థిని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ సురేష్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ముత్యం పాల్గొన్నారు.

# ఘనంగా తొలి ఏకాదశి పూజలు

**వాస్తవం : చెన్నూర్ ఆర్సీ**

తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని చెన్నూరులో భక్తులు భక్తిశ్రద్ధలతో పాదయాత్ర నిర్వహించారు. స్థానిక అంబ అగస్తేశ్వరాలయం నుంచి రుక్మాయి విఠలేశ్వర స్వామి దేవాలయం వరకు స్వామివారి పాదుకలను మోస్తూ మంగళ వాయిద్యాల నడుమ పాదయాత్ర కొనసాగింది.స్వామివారి నామస్మరణ చేస్తూ భక్తులు పాదయాత్రగా రుక్మాయి విఠలేశ్వర స్వామి ఆలయానికి చేరుకున్నారు. అనంతరం స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థప్రసాదాలను వితరణ చేశారు.ఈ



కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త శ్రీరాంభట్ల వెంకట నాఘరాఘు శర్మ, దుర్గా శంకర్ సోముని, జాడి తిరుపతి, కొమ్మెర నవీన్, సుసర్ల సురేష్, హరి వర్ధన్, రెడ్డి మహేష్, నూక శంకర్, విశ్వహిందూ పరిషత్ లక్ష్మణ్ రావు, గన్ను పాండు రంగా, వీరబ్రహ్మం, సంతోష్ సోముని, కొల్లూరి శంకర్, ఆర్ఎస్ఎస్ మధుకర్, ఆర్ఎస్ఎస్ మూర్ల మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్స్ సంక్షేమ సంఘం
Red 914/2015
జర్నలిస్ట్ల సంక్షేమమే పరమావధిగా
జర్నలిస్ట్ల హక్కుల కోసం....
వాళ్ల ప్రగతి కోసం... పత్రికా స్వేచ్ఛ కోసం...
సభ్యత్వ నమోదు కోసం సంప్రదించండి సెల్ నెం॥ 9618616110

# కేంద్ర మంత్రి రాజీనామా .. యువత, నీట్ విద్యార్థుల విజయం

**బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య**




**వాస్తవం : సిరిసిల్ల**

నీట్ లీకేజీలకు బాధ్యతగా కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం యువత, నీట్ విద్యార్థుల విజయమని భారత రాష్ట్ర సమితి పార్టీ రాజన్న సిరిసిల్ల అధ్యక్షులు తోట ఆగయ్య వెల్లడించారు.సిరిసిల్ల పట్టణంలోని తెలంగాణ భవనంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తోట ఆగయ్య మాట్లాడుతూ...నిన్న హైదరాబాద్‌లో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సైతం మద్దతు తెలిపి విద్యార్థుల డిమాండ్‌లను పరిష్కరించాలని, కేంద్ర మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారని అన్నారు. కేంద్ర మంత్రి నైతిక బాధ్యత వహించడాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. మరో కేంద్ర మంత్రి బండి సంజయ్ కేటీఆర్ పై అవాకులు,చెవాకులు పేలడం , విమర్శలు చేయడం మానుకోవాలని హితవు పలికారు.ఒక వైపు కొడుకు కేసు, మరో వైపు కరీంనగర్ లో వరుస భారీ చోరీలు జరగడంతో ఏం చేయాలో తెలియక కేటీఆర్ పై విమర్శలు చేయడం సిగ్గు చేటని అన్నారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసినట్లుగానే బండి సంజయ్ కూడా నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.రాబోయే రోజుల్లో బండి సంజయ్‌పై కూడా ఆందోళనలు చేస్తారని, తగిన గుణపాఠం చెపుతారని హెచ్చరించారు. ఈ సమా వేశంలో బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్య క్షుడు జిందం చక్రపాణి, న్యాల కొండ రాఘవ రెడ్డి, కంబాల మల్లారెడ్డి, గుండ్ల పల్లి పూర్ణ చందర్, మ్యాన రవి, అడి చెర్ల సాయి, బూర బాలు, గెంట్యాల శ్రీనివాస్, వేముల రాములు, లింగంపల్లి మధుకర్, పంగ రవి, కొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# మహిళా సాధికారతే లక్ష్యం

**సర్పంచ్ బర్మా రాజమల్లయ్య**

**మహిళా సంఘ భవనాలకు భూమిపూజ**

**రూ.20 లక్షల వ్యయంతో రెండు భవనాల నిర్మాణం**



**వాస్తవం :ముద్దూరు**

మహిళా సాధికారత లక్ష్యంగా గ్రామంలో మహిళా సంఘాలు మరింత అభివృద్ధి చెందాలని బైరానపల్లి గ్రామ సర్పంచ్ బర్మా రాజమల్లయ్య అన్నారు.శనివారం బైరానపల్లి గ్రామంలో ఆయన ఆధ్వర్యంలో మహిళా సంఘ భవనాల నిర్మాణానికి ఘనంగా భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాజమల్లయ్య మాట్లాడుతూ... వి.బి.జి రాంజీ ద్వారా బైరానపల్లి గ్రామానికి రూ. 20 లక్షల నిధులు మంజూరయ్యాయని తెలిపారు.గ్రామంలోని రెండు మహిళా విలేజ్ ఆర్గనైజేషన్లకు ఒక్కోదానికి రూ.10 లక్షల చొప్పున ఈ నిధులను కేటాయించినట్లు ఆయన వివరించారు. ఈ నిధుల తో మహిళా సంఘాలకు పక్కా భవనాలను నిర్మించనున్నట్లు పేర్కొన్నారు.మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదిగినపుడే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుంది. మహిళా సంఘాల బలోపేతానికి గ్రామ పంచాయతీ ఎల్లప్పుడూ ముందుం టుంది. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ టి. సిద్దులు, పంచాయతీ కార్యదర్శి కట్కూరి రాజు, గ్రామ పాలకవర్గ సభ్యులు దాసరి సుగుణ, కత్తుల రాజు, పులిగిల్ల లలిత, మోటం వినోద, పుప్పాల సింధు ప్రియ పాల్గొన్నారు. అలాగే వివో అధ్యక్షురాళ్లు రాగుల రజిత, చెలిమిల కళ్యాణి, సీసీ కనకచంద్రం, అంగన్‌వాడీ కార్యకర్తలు మన్నెం స్వరూప, మా యోజు విజయ, గ్రామ మహిళా సంఘాల నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# క్రమశిక్షణ,నిబద్ధతతో ప్రజల మన్ననలను పొందేలా పని చేయాలి

**రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి.గీతే**

**వాస్తవం : రాజన్న సిరిసిల్ల (ప్రతినిధి)**

క్రమశిక్షణ,నిబద్ధతతో ప్రజల మన్ననలను పొందేలా ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది పని చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే తెలిపారు.జిల్లా పోలీస్ కార్యాలయ అవరణలోని పరేడ్ మైదానంలో శనివారం జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్, సివిల్,హోమ్ గార్డ్ సిబ్బందికి నిర్వహించిన వీక్లీ పరేడ్ కి జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే హాజరై గౌరవ వందనం స్వీకరించారు.ఈసందర్భంగా ఎస్పీ మహేష్ బి. గీతే మాట్లాడుతూ.... ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, ప్రతిరోజు కనీసం అరగంట నడక చేయడం, బయట ఆహారాన్ని వీలైనంత వరకు నివారించడం, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని ఎస్పీ సూచించారు.క్రమశిక్షణతో డ్యూ టీలు నిర్వర్తించి ప్రజల మన్ననలు పొందేలాగా పని చేస్తూ పో లీస్ శాఖకి, జిల్లాకి మంచి పేరు తెచ్చేలాగా పని చేయాలని అన్నారు. ఈ పరేడ్ లో జిల్లా అదనపు ఎస్పీ చంద్రయ్య,ఆర్ఐలు మధుకర్, సురేష్, రమేష్, ఆర్ఎస్ఐలు రాజు, శ్రవణ్ యాదవ్, దిలీప్, సాయి కిరణ్, పాల్గొన్నారు.



# స్టార్ హోటళ్లలో హాలిడే ప్యాకేజీల పేరుతో భారీ మోసం

**గచ్చిబౌలి పోలీసుల దాడుల్లో 15 మంది అరెస్ట్**

**రూ.22 లక్షలకు పైగా వసూళ్లు**

**వాస్తవం : కుత్బుల్లాపూర్ ఆర్ సీ : జూలై 25:**






హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ప్రాంతంలో స్టార్ హోటళ్లను వేదికగా చేసుకుని అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకొని హాలిడే మెంబర్షిప్‌ల పేరుతో భారీ మోసానికి పాల్పడుతున్న ముఠాను సైబరాబాద్ గచ్చిబౌలి పోలీసులు ఛేదించారు. "ది పసిఫిక్ హాలిడే వరల్డ్" పేరుతో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఈ సంస్థకు చెందిన 15 మంది హాలిడే కన్సల్టెంట్లు, నిర్వాహకులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ కొనసాగిస్తున్నారు. ప్రాథమిక దర్యాప్తులో ఇప్పటివరకు 19 మంది బాధితులను గుర్తించగా, వారి నుంచి సుమారు రూ.22 లక్షలు మోసపూరితంగా వసూలు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, న్యూఢిల్లీ కేంద్రంగా నమోదైన 4ఆర్ సీజన్స్ హాలిడేస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు చెందిన ది పసిఫిక్ హాలిడే వరల్డ్ పేరుతో ఈ ముఠా కార్యకలాపాలు నిర్వహిస్తోంది. కంపెనీ మార్కెటింగ్ సిబ్బంది హైదరాబాద్‌తో పాటు పలు ప్రధాన నగరాల్లోని ప్రముఖ షాపింగ్ మాల్స్, కమర్షియల్ సెంటర్ల వద్దకు వెళ్లి అక్కడికి వచ్చిన ప్రజలకు ఉచిత కూపన్లు, గిఫ్ట్ వోచర్లు, లక్కీ డ్రా బహుమతులు ఇస్తామని చెప్పి వారి మొబైల్ నంబర్లు సేకరించే వారు. అనంతరం బాధితులకు ఫోన్ చేసి గచ్చిబౌలిలోని రాడిసన్ వంటి స్టార్ హోటళ్లకు ఆహ్వానించి ప్రత్యేక కార్యక్రమం పేరుతో సమావేశాలు ఏర్పాటు చేసేవారు.ఆ సమావేశాల్లో హాలిడే మెంబర్షిప్ పథకాల పేరుతో ఆకర్షణీయమైన ఆఫర్లు చూపిస్తూ, రూ.1.25 లక్షలు చెల్లిస్తే ఐదు సంవత్సరాల పాటు ప్రతి సంవత్సరం దేశంలోని ఏ ప్రాంతంలోనైనా ఏడు రాత్రుల ఉచిత బస కల్పిస్తామని, పది సంవత్సరాల మెంబర్షిప్ తీసుకుంటే విదేశాల్లో కూడా ఏడు రాత్రుల బస ఏర్పాటు చేస్తామని నమ్మించేవారు. వెంటనే చెల్లిస్తే ప్రత్యేక డిస్కౌంట్లు, గిఫ్టులు, అదనపు ప్రయోజనాలు అందిస్తామని చెప్పి బాధితులపై ఒత్తిడి తెచ్చి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు విచారణలో వెల్లడైంది.ఈ వ్యవహారంపై జూలై 24న పుట్టూరి స్వరాజ్ గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తనను రాడిసన్ హోటల్‌కు పిలిచి తప్పుడు హామీలు ఇచ్చి హాలిడే మెంబర్షిప్ కొనుగోలు చేయాలని ప్రలోభపెట్టారని, వారి మాటలు నమ్మి జూలై 16న హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ క్రెడిట్ కార్డు ద్వారా రూ.3.40 లక్షలు చెల్లించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. డబ్బు తీసుకున్న తర్వాత కంపెనీ ప్రతినిధులు హామీ ఇచ్చిన సేవలు అందించకపోగా, తన ఫోన్ కాల్స్, సందేశాలకు కూడా స్పందించడం నిలిపివేశారని ఆరోపించారు.బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి, సంస్థకు చెందిన 15 మంది హాలిడే కన్సల్టెంట్లు, నిర్వాహకులను అదుపులోకి తీసుకున్నారు. వీరంతా దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. విచారణలో తాము ఈ సంస్థలో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌లుగా పనిచేస్తూ స్టార్ హోటళ్లలో ప్రచార కార్యక్రమాలు నిర్వహించినట్లు అంగీకరించినట్లు పోలీసులు వెల్లడించారు.ప్రాథమిక దర్యాప్తులో ఇప్పటి వరకు 19 మంది బాధితులను గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. ఈ బాధితుల నుంచి సుమారు రూ.22 లక్షలు మోసపూరితంగా వసూలు చేసినట్లు ఆధారాలు లభించాయని పేర్కొన్నారు. ఇదే తరహాలో మోసపోయిన మరిన్ని బాధితులను గుర్తించేందుకు ప్రత్యేకంగా దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రజలకు సైబరాబాద్ పోలీసులు కీలక సూచనలు చేశారు. హాలిడే మెంబర్షిప్‌లు, టూర్ ప్యాకేజీలు, ఉచిత బహుమతులు, స్టార్ హోటళ్లలో నిర్వహించే ప్రమోషనల్ సమావేశాల పేరుతో వచ్చే ఆఫర్ల విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. కంపెనీ విశ్వసనీయతను పూర్తిగా నిర్ధారించకుండా డబ్బులు చెల్లించవద్దని, ఒప్పంద పత్రాలను పూర్తిగా చదవకుండా సంతకాలు చేయవద్దని సూచించారు. అలాగే షాపింగ్ మాల్స్, వాణిజ్య సముదాయాలు లేదా ఇతర బహిరంగ ప్రదేశాల్లో అపరిచితులకు వ్యక్తిగత వివరాలు ఇవ్వవద్దని, అనుమానాస్పద ఘటనలు ఎదురైతే వెంటనే సమీప పోలీస్ స్టేషన్ లేదా సైబరాబాద్ పోలీసులను సంప్రదించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# ఆఖరి చిరునవ్వు



రాత్రి సమయం తొమ్మిది గంటలు కావస్తోంది. హైదరాబాద్‌లోని ఒక అంతర్జాతీయ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఆదిత్య తన ల్యాప్‌టాప్ ముందు తీవ్రమైన ఒత్తిడితో కూర్చుని ఉన్నాడు. కళ్ళు అలసిపోయాయి, వేళ్ళు కీబోర్డ్ మీద శరవేగంగా కదులుతున్నాయి. మరొక గంటలో సమర్పించాల్సిన ఒక పెద్ద ప్రాజెక్ట్ డెడ్‌లైన్ అతన్ని వెంటాడుతోంది. సరిగ్గా అదే సమయంలో అతని ఫోన్ వైబ్రేట్ అవుతూ మెరిసింది. స్క్రీన్‌పై చూస్తే "నాన్న" అని పేరు కనిపిస్తోంది. అప్పటికే పని ఒత్తిడిలో ఉన్న ఆదిత్య, "ఇప్పుడు ఈ ఫోన్ ఎత్తితే కనీసం అరగంట సమయం వృథా అవుతుంది. నాన్నకి ఎంత చెప్పినా అర్థం కాదు," అని మనసులోనే అనుకుంటూ విసుగ్గా ఫోన్‌ను సైలెంట్ మోడ్‌లో పెట్టేశాడు. మళ్ళీ ఒక పది నిమిషాల తర్వాత అదే సంఖ్య నుండి కాల్ వచ్చింది. ఆదిత్య ఈసారి కూడా ఫోన్ ఎత్తే సాహసం చేయలేదు. అయితే, ఈసారి కాల్ కట్ అయిన వెంటనే వాట్సాప్‌లో ఒక చిన్న సందేశం వచ్చింది."బాబూ... వీలైతే ఒక్కసారి మాట్లాడవా? నీ గొంతు విని చాలా రోజులైందిరా, ఒక్కసారి మాట్లాడాలనిపించింది."ఆదిత్య ఆ సందేశాన్ని ఒక్క క్షణం చూశాడు. కానీ ప్రాజెక్ట్ డెడ్‌లైన్ గడియారం అతన్ని హెచ్చరిస్తుండటంతో, "రేపు ఉదయం నిరాటంకంగా నాన్నతో మాట్లాడుదాంలే," అని సర్దిచెప్పుకుని మళ్ళీ పనిలో మునిగిపోయాడు. కానీ, అతనికి తెలియదు. ఆ రేపు అనేది తన జీవితంలో ఎప్పటికీ రాని ఒక విధి వెక్కిరింత అని!మరుసటి రోజు తెల్లవారు జామున నాలుగు గంటల సమయం. ఆదిత్య గాఢనిద్రలో ఉండగా ఫోన్ గట్టిగా మోగింది. సగం నిద్రలోనే ఫోన్ తీసి చూస్తే చెల్లెలి పేరు ఉంది. భయంతో కాల్ లిఫ్ట్ చేశాడు. ఆ వైపు నుంచి చెల్లెలు విలపిస్తూ, "అన్నయ్య... నాన్నకు సడన్‌గా తీవ్రమైన గుండెపోటు వచ్చింది... ఆసుపత్రికి తీసుకెళ్తుండగానే దారిలోనే..."ఆ మాట పూర్తి కాకముందే ఆదిత్య చేతిలోని ఫోన్ కిందపడిపోయింది. నిశ్శబ్దం అతన్ని అలుముకుంది. గుండె ఆగిపోయినంత పనైంది. వెంటనే కట్టుబట్టలతో ఊరికి పరుగుతీశాడు. పల్లెటూరిలోని తన పెంకుటింటి ముందుకు చేరేసరికి ఇంటి ప్రాంగణమంతా జనం నిండిపోయారు. ఇల్లు నిశ్శబ్దంతో, రోదనలతో నిండిపోయింది. ఇంటి నడిమధ్యలో తెల్లటి వస్త్రంతో కప్పబడిన తండ్రి నిర్జీవ శరీరం ఉంది. తన చిన్నతనం నుండి ప్రతి అడుగులో ఆసరాగా నిలిచి, కుటుంబం కోసం జీవితాంతం రక్తం చెమటగా మార్చి కష్టపడ్డ ఆ మహావృక్షం ఇప్పుడు శాశ్వతంగా నిద్రపోతోంది.

..............

ఆదిత్య కాళ్ళు వణుకుతుండగా మోకాళ్లపై కూర్చుని, తండ్రి ముఖంపై ఉన్న గుడ్డను పక్కకు తొలగించి చూశాడు. అతనికి ఒక విచిత్రమైన దృశ్యం కనిపించింది. ఆ ముఖంలో మరణ వేదన లేదు, కొడుకు ఫోన్ ఎత్తలేదనే కోపం లేదు.కేవలం ఒక ప్రశాంతమైన, తేలికపాటి చిరునవ్వు మాత్రమే ఉంది."చివరి క్షణంలో కూడా నాన్న ముఖంలో అంతటి ప్రశాంతమైన చిరునవ్వు ఎందుకు ఉంది?" అనే ప్రశ్న ఆదిత్య మనసును తొలిచేస్తూనే ఉంది. దహన సంస్కారాలు, ఇతర కర్మకాండలన్నీ ముగిసిన తర్వాత, ఒక సాయంత్రం తల్లి కంటనీరు పెట్టుకుంటూ ఒక పాత, నలిగిపోయిన డైరీని ఆదిత్య చేతిలో పెట్టింది. "ఇది నీ నాన్న రాసుకున్న డైరీరా. ఆఖరి రోజుల్లో దీన్నే పట్టుకుని కూర్చునేవాడు. నువ్వే చదువుకో," అంది. వణుకుతున్న చేతులతో డైరీ మొదటి పేజీ తెరిచాడు. అందులో నాన్న చేతిరాతతో ఇలా ఉంది. "నేను చూడలేని ఈ అందమైన ప్రపంచాన్ని నా పిల్లలు చూడాలి. అందుకే నా సొంత కలలన్నింటినీ చంపేసి, ఆ కలల విత్తనాలను నా పిల్లల భవిష్యత్తులో నాటాను."తర్వాతి పేజీలు ఒక్కొక్కటి తిప్పుతుంటే ఆదిత్య కళ్ళలో కన్నీళ్ళు ఆగకుండా కారడం మొదలైంది."ఆదిత్యకు స్కూల్ ఫీజు కట్టడానికి ఈ నెల నాకు కొత్త చొక్కా కొనడం ఆపేశాను. పర్లేదు, పాత చొక్కా బాగానే ఉంది." "కొడుకుకు ఇంజినీరింగ్ సీటు వచ్చింది. కాలేజీ ఫీజు కోసం పొలంలో రెండు ఎకరాలు అమ్మేశాను. కానీ నా కొడుకు పెద్ద చదువు చదువుతున్నాడనే ఆనందం ముందు ఈ బాధ ఏపాటిది?" "ఈరోజు బాబు ఉద్యోగం వచ్చిందని ఫోన్ చేసి చెప్పాడు. ఆఫీస్ పనిలో చాలా బిజీగా ఉన్నాడు, ఎక్కువ మాట్లాడలేదు. కానీ అతని నోటి నుండి 'నాన్నా' అనే ఆ ఒక్క మాట వింటే చాలు, నాకు ఈ ప్రపంచమంత ఆనందం లభిస్తుంది."చివరిగా డైరీ ఆఖరి పేజీకి వచ్చాడు. అది తండ్రి చనిపోవడానికి సరిగ్గా ముందు రోజు రాత్రి రాసిన మాటలు."ఈ మధ్య నా బాబు చాలా బిజీగా ఉంటున్నాడు. నేను ఫోన్ చేస్తే ఆఫీస్ పనుల వల్ల ఎత్తలేకపోతున్నాడు. అతనిపై నాకు ఏమాత్రం కోపం లేదు. నేను కూడా అతని వయసులో ఉన్నప్పుడు నా కుటుంబ పోషణ కోసం ఇలాగే రాత్రింబవళ్లు పరిగెత్తాను. కానీ ఈరోజు ఎందుకో అతని గొంతు ఒక్కసారి వినాలనిపిస్తోంది. రేపు ఉదయం మళ్ళీ ప్రయత్నించి ఫోన్ చేస్తాను."ఆ పేజీపై రెండు చోట్ల నీటి చుక్కలు పడి ఆరిపోయిన మరకలు కనిపిస్తున్నాయి. అవి కేవలం నీటి మరకలు కావు, తండ్రి కంటి నుండి కారిన ఆవేదన కన్నీటి చుక్కలని ఆదిత్యకు అర్థమైంది.ఆ రాత్రి ఆదిత్య తండ్రి గదిలో ఒంటరిగా కూర్చున్నాడు. గోడపై వేలాడుతున్న పాత గడియారం 'టిక్... టిక్...' అంటూ కాలాన్ని లెక్కిస్తోంది. మంచం పక్కన పాత కళ్లద్దాలు, సగం మడిచిన వార్తాపత్రిక, సగం

**ఇది**
**కేవలం ఒక కథ**
**కాదు.మన నిత్య జీవితంలో బిజీ అనే ముసుగులో మనం కోల్పోతున్న బంధాలకి, అనుబంధాలకి అద్దం పట్టే ఒక నిశ్శబ్ద ఆవేదన. సమయం, బంధాలు మన చేతుల్లో ఉన్నప్పుడే వాటి విలువను గుర్తించకపోతే, తర్వాత మిగిలేది తీరని పశ్చాత్తాపమేనని చాటిచెప్పే హృదయవిదారకమైన గాథ ఇది.**

చదివి పక్కన పెట్టిన భగవద్గీత పుస్తకం... అన్నీ తండ్రి స్పర్శను గుర్తుచేస్తూ అలాగే ఉన్నాయి.అకస్మాత్తుగా టేబుల్ డ్రాయర్‌లో ఒక తెల్లటి కవర్ కనిపించింది. దానిపై



తండ్రి చేతిరాతతో "నా ముద్దుల ఆదిత్యకు..." అని రాసి ఉంది.ఆదిత్య ఆ కవరు తెరిచి, లోపల ఉన్న ఉత్తరాన్ని చదవడం ప్రారంభిం చాడు:"బాబూ... ఈ ఉత్తరం నువ్వు చదివే సమయానికి నేను నీకు భౌతికంగా దూరమై ఉండవచ్చు. నాకు నీ దగ్గర నుంచి రూపాయి డబ్బుగానీ, ఖరీదైన బహుమతులుగానీ అవసరం లేదురా. నువ్వు ఎంత బిజీగా ఉన్నా, అప్పుడ ప్పుడూ 'ఎలా ఉన్నావు నాన్న?' అని ఒక చిన్న ప్రశ్న అడిగితే చాలు. వృద్ధాప్యంలో తల్లిదండ్రులకు మందుల కంటే పిల్లల తీపి మాటలే ఎక్కువ ఆయుష్షును, బలాన్ని ఇస్తాయి. నేను చనిపోయాక నా కోసం నువ్వు కన్నీళ్ళు పెట్టుకుని ఏడవద్దు. నువ్వు సమాజంలో ఒక మంచి మనిషిగా, నిజాయితీగా జీవిస్తే అదే నువ్వు నాకు ఇచ్చే నిజమైన, గొప్ప నివాళి. 'నీకు నాదొక చిన్న అభ్యర్థన. నీ పిల్లలు పెద్దయ్యాక నువ్వు అనుభవించిన ఈ ప్రేమానురాగాల లోటు, ఈ బాధ వాళ్లకు రాకుండా చూసుకో. ఉద్యోగం, సంపాదన ఎంత ముఖ్యమో... కుటుంబా నికి సమయం ఇవ్వడం కూడా అంతే ముఖ్యం."ఉత్తరం చివరలో ఇలా రాసి ఉంది: "నువ్వు పుట్టిన రోజు నీ చిరునవ్వు చూసి నేను జీవితంలో మొదటిసారి ఎంతో సంతోషంగా నవ్వాను. నువ్వు ఒక మంచి మనిషిగా సమాజంలో నిలబడితే ... నేను కన్నుమూసే ఆ చివరి క్షణంలో కూడా ప్రశాంతంగా నవ్వుతాను."ఆ మాటలు చదివాక ఆదిత్యకు తండ్రి ముఖంలోని ఆ చివరి చిరునవ్వు రహస్యం పూర్తిగా అర్థమైంది. తన కొడుకు జీవితంలో బాగా స్థిరపడ్డాడనే తృప్తి, తాను పెంచిన కొడుకు ఖచ్చితంగా మంచి మార్గంలోనే జీవిస్తాడనే అపారమైన నమ్మకం... ఆ నమ్మకమే తండ్రి ముఖంలో ఆఖరి చిరునవ్వుగా మారింది.ఆ సంఘటన జరిగిన నెల రోజుల తర్వాత ఆదిత్య జీవితంలో ఊహించని ఎన్నో మార్పులు వచ్చాయి. అతడు ఆఫీస్‌లో అనవసరమైన రాత్రివేళల పనిని తగ్గించుకున్నాడు. ప్రతి సాయంత్రం వేళకి ఇంటికి వచ్చి భార్య, పిల్లలతో కలిసి సంతోషంగా భోజనం చేయడం అలవాటు చేసుకున్నాడు. ఒంటరిగా ఉన్న అమ్మతో రోజూ కనీసం గంటసేపు మన స్ఫూర్తిగా మాట్లాడేవాడు. ఒక ఆదివారం ఉదయం, ఆదిత్య తన చిన్న కుమారుడి చేయి పట్టుకుని ఊరి చివర ఉన్న తండ్రి సమాధి దగ్గరకు వెళ్లాడు.ఆ చిన్నారి అమాయకంగా తండ్రి వైపు చూస్తూ అడిగాడు, "నాన్న... అసలు మన తాతయ్య ఎలాంటివారు? ఆయన ఎలా ఉండేవారు?"ఆదిత్య కళ్ళలో సన్నని నీటి పొర మెరుస్తుండగా, చిరునవ్వుతో చెప్పాడు, "నన్ను ఒక బాధ్యతగల మనిషిగా తీర్చిదిద్దిన ఈ ప్రపంచంలోనే అత్యంత గొప్ప గురువురా మన తాతయ్య.'అయితే ఆయన ఇప్పుడు ఎక్కడ ఉన్నారు నాన్న?" అని కొడుకు మళ్ళీ అడిగాడు.ఆదిత్య తన కుమారుడి చేయి తీసి తన గుండెపై పెట్టుకుని భావోద్వేగంతో అన్నాడు, "ఇక్కడ... నేను చేసే ప్రతి మంచి పనిలో, నేను పలికే ప్రతి నిజాయితీగల మాటలో, నేను మీకు పంచే ప్రతి పేగు బంధపు ప్రేమలో... మన తాతయ్య ఇంకా జీవించే ఉన్నారురా.'సరిగ్గా అదే సమయంలో చల్లటి గాలి మెల్లగా వీచింది. సమాధిపై ఉంచిన తెల్లటి మల్లెపూలు స్వల్పంగా కదిలాయి.ఆదిత్యకు ఎందుకో మన స్ఫూర్తిగా అనిపించింది... నింగిలో నివసిస్తున్న తన తండ్రి, కొడుకులో వచ్చిన ఈ మార్పును చూసి ఆకాశం అంచుల నుండి మళ్ళీ ఒకసారి ఆత్మీయంగా చిరునవ్వు నవ్వుతున్నారని!

# డిజిటల్ విద్య విప్లవమా...వర్గ వైవిధ్యమా?



డా. సూర్యదేవర రామకృష్ణ
9490754169

కరోనా మహమ్మారి తదనంతరం దేశీయ విద్యా రంగం ఒక వినూత్న మలుపు తిరిగింది. వైరస్ వ్యాప్తి నిరోధానికి బడుల తలుపులు మూతపడిన వేళ, చదువు ఆగకూడదు అనే నినాదంతో ఆన్‌లైన్ తరగతులు, ఎడ్‌టెక్ యాప్‌లు విద్యార్థుల చేతుల్లోకి చేరాయి. బైజూస్, అన్‌అకాడమీ, వేదాంతు వంటి దిగ్గజ సంస్థలు కోట్లాది రూపాయల పెట్టుబడులతో దేశవ్యాప్తంగా విపరీతమైన ప్రచారం పొంది సరికొత్త వ్యాపార సామ్రాజ్యాలను నిర్మించాయి. ప్రభుత్వ పాఠశాలలు సైతం దూరదర్శన్, యూ ట్యూబ్ ఛానళ్ల ద్వారా పాఠాలు అందించే ప్రయత్నం చేయడం గమనార్హం. ఇదంతా విద్యా రంగంలో ఒక సరికొత్త విప్లవంలా కనిపించినప్పటికీ, ఈ సాంకేతిక మార్పు అందరికీ సమానంగా అందిందా? లేదా అనేది నేడు మిగిలిన ప్రధాన ప్రశ్న.

### నాణేనికి రెండో వైపు పెరిగిన డిజిటల్ అగాధం:

పట్టణ ప్రాంతాల్లోని మధ్యతరగతి, ఉన్నత వర్గాల పిల్లలు ల్యాప్‌లాప్‌లు, స్మార్ట్ ఫోన్‌లు, హైస్పీడ్ ఇంటర్నెట్ కనెక్షన్లతో సునాయాసంగా ఆన్‌లైన్ చదువులకు అలవాటుపడ్డారు. అదే సమయంలో, గ్రామీణ ప్రాంతాల్లోని పేదలు, ముఖ్యంగా రోజువారీ కూలీల పిల్లలు ఈ సాంకేతిక మార్పును అందుకోలేక తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. జాతీయ నమూనా సర్వే సంస్థ గణాంకాల ప్రకారం, గ్రామీణ భారతంలో ఇంటర్నెట్ సదుపాయం ఉన్న కుటుంబాల శాతం పట్టణాలతో పోలిస్తే అత్యల్పంగా ఉంది. ఒక ఇంట్లో ఒకే స్మార్ట్‌ఫోన్ ఉండి, దాన్ని తండ్రి ఉపాధి కోసం వెంట తీసుకెళ్తే, ఆ ఇంట్లోని పిల్లలు పాఠాలకు దూరం కావాల్సిన దుస్థితి ఏర్పడింది. తెలుగు రాష్ట్రాల్లోని ఏజెన్సీ ప్రాంతాలు, గిరిజన తండాలు, కరువు పీడిత జిల్లాల్లో ఈ సమస్య మరింత తీవ్ర రూపం దాల్చింది. సెల్ టవర్ సిగ్నల్ కోసం కొండలు ఎక్కి, చెట్టు కొమ్మలపై కూర్చుని పాఠాలు విన్న విద్యార్థుల దీన గాథలు ఆ రోజుల్లో ప్రముఖ దినపత్రికల్లో పతాక శీర్షికలుగా నిలిచాయి. ఇది కేవలం తాత్కాలిక సాంకేతిక అసౌకర్యం మాత్రమే కాదు; ఒక పూర్తి తరం విద్యార్థుల భవిష్యత్తుపై పడిన కోలుకోలేని దెబ్బ అని విశ్లేషకులు భావిస్తున్నారు.

### విద్యలో కొత్త రకం వర్గ విభజన:


గతంలో విద్యా వ్యవస్థలో అసమానత అనేది కేవలం ప్రభుత్వ పాఠశాలలు వర్సెస్ ప్రైవేటు పాఠశాలలు అనే చర్చకే పరిమితమయ్యేది. కానీ డిజిటల్ యుగం దీనికి మరో కొత్త కోణాన్ని జోడించింది. సమాజంలో కనెక్టివిటీ ఉన్నవారు లేని వారు అనే నూతన వర్గీకరణ పుట్టుకొచ్చింది. ఇంటర్నెట్, ఫోన్ సౌకర్యం ఉన్నప్పటికీ, తల్లిదండ్రుల నిరక్షరాస్యత, ఇంట్లో చదువుకునే వాతావరణం లేకపోవడం వల్ల చాలామంది పిల్లలు ఆన్‌లైన్ తరగతులకు నామమాత్రంగా హాజరై అభ్యసనంలో వెనుకబడ్డారని అనేక అధ్యయనాలు స్పష్టం చేశాయి.అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ వంటి ప్రముఖ స్వచ్ఛంద సంస్థలు నిర్వహించిన క్షేత్రస్థాయి సర్వేలు విస్తుపోయే నిజాలను వెలుగులోకి తెచ్చాయి. బడులు తిరిగి ప్రారంభమయ్యాక, అనేకమంది విద్యార్థులు రెండు మూడు తరగతుల వెనుకబడి ఉన్నట్లు గుర్తించారు. ఈ తీవ్రమైన లెర్నింగ్ లాస్ (అభ్యసన నష్టం) ప్రభావం అత్యధికంగా పేద, గ్రామీణ, మొదటి తరం విద్యార్థులపైనే పడటం గమనార్హం.


### భారీ ఎడ్‌టెక్ పతనం నేర్పిన పాఠాలు:

ఒకప్పుడు ప్రపంచంలోనే అత్యంత విలువైన ఎడ్‌టెక్ సంస్థగా వేల కోట్లతో విర్రవీగిన బైజూస్ పతనం, ఈ వ్యాపార రంగానికి చెంపపెట్టులా మారింది. మహమ్మారి కాలంలో తల్లిదండ్రుల ఆందోళనను ఆసరాగా చేసుకుని, దూకుడుగా మార్కెటింగ్ చేస్తూ, అప్పులు ఇప్పించి మరీ కోర్సులు విక్రయించిన తీరుపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. విద్యాసంస్థలు తిరిగి తెరుచుకోవడంతో విద్యార్థులు భౌతిక తరగతుల వైపు మొగ్గు చూపారు. దీంతో ఈ సంస్థల ఆదాయం ఒక్కసారిగా అట్టడుగుకు పడిపోయింది.అస్తవ్యస్తమైన ఆర్థిక నిర్వహణ, విచక్షణారహితంగా సిబ్బంది నియామకాలు, పెట్టుబడిదారుల విశ్వాసం సన్నగిల్లడం వంటి కారణాలు ఈ రంగాన్ని కుప్పకూల్చాయి. సాంకేతికత అనేది బోధనకు ఒక సాధనం మాత్రమే తప్ప, అది తరగతి గదికి లేదా ఉపాధ్యాయుడికి ప్రత్యామ్నాయం కాదని ఈ పరిణామాలు నిరూపించాయి. లాభాపేక్షతో కూడిన వ్యాపార నమూనాలు గ్రామీణ విద్యార్థులకు ఏమాత్రం ఉపయోగపడలేవని స్పష్టమైంది.

### ప్రభుత్వ సంక్షేమ పథకాలు - క్షేత్రస్థాయి నిజాలు :

ఈ డిజిటల్ అంతరాన్ని పూడ్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దీక్ష, స్వయం ప్రభ ఛానళ్లు, తెలుగు రాష్ట్రాల్లో టీశాట్ వంటి పథకాలను ముందుకు తీసుకొచ్చాయి. బిఎస్ఎన్ఎల్ ద్వారా మారుమూల గ్రామాలకు ఇంటర్నెట్ అనుసంధానం, విద్యార్థులకు ఉచిత టాబ్లెట్‌ల పంపిణీ వంటి బృహత్తర చర్యలు చేపట్టినట్లు ప్రకటించాయి. అయితే పథకాల అమలులో తీవ్రమైన జాప్యం, మౌలిక సదుపాయాల కొరత, నిరంతర విద్యుత్ సరఫరా లేకపోవడం ఈ ప్రయత్నాల ఫలితాలను పరిమితం చేశాయి. కొన్ని జిల్లాల్లో పంపిణీ చేసిన ఉచిత టాబ్లెట్‌లు సాంకేతిక లోపాలు, మరమ్మతులు లేక పాఠశాలల్లో మూలనపడ్డాయని పత్రికా కథనాలు వెల్లడించాయి.





### మిశ్రమ నమూనానే సరైన మార్గం:

డిజిటల్ విద్యను సమర్థించే వర్గాలు, మారుమూల గ్రామాల పిల్లలకు సైతం ఉత్తమ ఉపాధ్యాయుల బోధన, జాతీయ స్థాయి శిక్షణ తక్కువ ఖర్చుకే లభించాయని వాదిస్తున్నారు. యూట్యూబ్‌లోని ఉచిత విద్యా కంటెంట్, డిజిటల్ లైబ్రరీలు దీనికి ఉదాహరణలుగా చూపుతున్నారు. అయితే, కేవలం డిజిటల్ సమాచారం అందుబాటులో ఉంటే సరిపోదని, దాన్ని అందుకునే సామర్థ్యం, నిరంతర విద్యుత్, ఇంటర్నెట్ సదుపాయాలు లేనప్పుడు అది నిరుపయోగమని విమర్శకులు సరిగ్గా ఎత్తిచూపుతున్నారు.ఈ పరిస్థితికి డిజిటల్ విద్య మంచిదా లేదా చెడ్డదా అనే కోణంలో కాకుండా, దాన్ని సమాజంలోని చివరి వ్యక్తికి సైతం ఎలా అందుబాటులోకి తేవాలనేదే అసలైన సవాలు. సాంకేతికతను తరగతి గది బోధనకు అనుబంధంగా మాత్రమే ఉపయోగించే హైబ్రిడ్ మోడల్ విద్యారంగానికి శ్రీరామరక్ష. ఉపాధ్యాయులకు ఆధునిక శిక్షణ, గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన మౌలిక వసతుల కల్పన ద్వారా మాత్రమే డిజిటల్ విద్య సార్థకమవుతుంది. లేనిపక్షంలో, ఇది అభివృద్ధికి సాంకేతిక రూపులా కనిపిస్తూనే, సామాజిక అసమానతలను మరింత పెంచే సాధనంగా మిగిలిపోయే ప్రమాదముంది. చేరాల్సిన చివరి విద్యార్థికి సాంకేతికఫలాలు అందనంత వరకు దీన్ని విద్యా విప్లవంగా అభివర్ణించడం అతిశయోక్తి మాత్రమే అవుతుంది.


**గతంలో విద్యా వ్యవస్థలో అసమానత అనేది కేవలం ప్రభుత్వ పాఠశాలలు వర్సెస్ ప్రైవేటు పాఠశాలలు అనే చర్చకే పరిమితమయ్యేది. కానీ డిజిటల్ యుగం దీనికి మరో కొత్త కోణాన్ని జోడించింది. సమాజంలో కనెక్టివిటీ ఉన్నవారు లేని వారు అనే నూతన వర్గీకరణ పుట్టుకొచ్చింది. ఇంటర్నెట్, ఫోన్ సౌకర్యం ఉన్నప్పటికీ, తల్లిదండ్రుల నిరక్షరాస్యత, ఇంట్లో చదువుకునే వాతావరణం లేకపోవడం వల్ల చాలామంది పిల్లలు ఆన్‌లైన్ తరగ తులకు నామమాత్రంగా హాజరై అభ్య సనంలో వెనుకబడ్డారని అనేక అధ్యయ నాలు స్పష్టం చేశాయి.**

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా

**న్యూఢిల్లీ :** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. నీట్ పేపర్ లీకేజీ అంశం నేపథ్యంలో ఆయన తన రాజీనామాను సమర్పించారు. కాక్రోచ్ జనతా పార్టీ దేశవ్యాప్తంగా ప్రధాన్ రాజీనామా కోరుతూ ఆందోళనలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే అని పార్లమెంట్‌లో విపక్ష పార్టీలు కూడా డిమాండ్ చేశాయి. పార్ల మెంట్ సమావేశాలను గత వారం నుంచి విపక్షాలు ఈ అంశంపైనే స్తంభింప చేశాయి.జూలై 20వ తేదీన కాక్రోచ్ జనతా పార్టీ నిర్వహించిన చలో పార్లమెం ట్ హింసాత్మకంగా మారడంతో.. విపక్షాలు కూడా తమ గళాన్ని తీవ్రం చేశాయి. విద్యార్థి లోకంతో పాటు విపక్షాలు కూడా డిమాండ్ చేయడంతో.. మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చివరకు ఇవాళ తన రాజీనా మాను సమర్పించారు. ధర్మేంద్ర ప్రధాన్ తన ఎక్స్ అకౌంట్‌లో .. హిందీ భాషలో ఓ లేఖను రిలీజ్ చేశారు.

## యువత ఆకాంక్షలు, ఆశయాలను గౌరవిస్తున్నా

న్యూఢిల్లీ: కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. ఆయన తన రాజీనామా లేఖను ఎక్స్‌లో పోస్టు చేశారు. దాంట్లో ఏం రాశారంటే.. గత 10 రోజుల నుంచి జరుగుతున్న పరిణామాలను తనను బాధకు గురిచేసినట్లు మంత్రి ప్రధాన్ పేర్కొన్నారు. ఇది నా వ్యక్తిగత ప్రతిష్టకు చెందిన విషయం కాదు అని అన్నారు. భారత యువశక్తియే ఈ దేశానికి అసలైన శక్తి అని అన్నారు. దేశ యువశక్తిని భ్రమలో పడకుండా చూస్తానన్నారు. ఇదే తన సంకల్పం అని మంత్రి పేర్కొన్నారు.జంతర్ మంతర్ కానీ, ఇతర ప్రదేశాల్లో జరిగిన సంఘటనలతో దేశ విరోధ శక్తులు బలపడకుండా చూడాలన్నారు. దేశం ఐక్యతతో నిలవాలన్నారు. భారత విద్యార్థుల భవిష్యత్తు దేశ చట్టాలకు బంధీ కావొద్దన్నారు. మన పిల్లలు తమ మనసును చదువులపై పెట్టాలని, కెరీర్‌పై ఫోకస్ పెట్టాలని, ఈ విషయంపై ఆలోచనలు చేసి, తన రాజీనామాను ప్రధాని మోదీకి సమర్పించినట్లు మంత్రి ప్రధాన్ పేర్కొన్నారు.ప్రభు జగన్నాథుడి ఆశీస్సులతో భవిష్యత్తులో దేశమాత కోసం సేవ చేస్తానన్నారు. ఒడిశా ప్రజలు, దేశ యువత ఆకాంక్షలను నెరవేర్చేందుకు కృషి చేయ నున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రజాస్వామ్య వ్యవస్థ మీద నాకు నమ్మకం ఉందని, యువత ఆకాంక్షలు, ఆశయాలను గౌరవిస్తున్నానన్నారు. యువత కేవలం భారత దేశ భవిష్యత్తు మాత్రమే కాదు, వాళ్లు వికసిత భారత్‌కు కొత్త వాహకాలు అన్నారు. భవిష్యత్ నిర్మాతలు, శిల్పకారులు అని కూడా యువతే అని పేర్కొన్నారు.మే 3వ తేదీన జరిగిన పరీక్షలో అక్రమాలు జరిగినట్లు తెలియనే. ఆ కేసును సీబీఐకి అప్పగించామన్నారు. ఆ ఎగ్జామ్‌ను మళ్లీ షెడ్యూల్ చేశామన్నారు. 2027 నుంచి నీట్ యూజీ పరీక్షను కంప్యూటర్ ఆధారిత పరీక్షగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ప్రధాన్ తెలిపారు. సుమారు 20 లక్షల మంది రాసిన నీట్ పరీక్షను స్మూత్‌గా నిర్వహించడమే ప్రాధాన్యతగా ప్రభుత్వం వ్యవహరించిం దన్నారు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు, జిల్లా యంత్రాంగం దీనికి సహకరించిందన్నారు. విద్యార్థులు, గార్డియన్లు, పేరెంట్స్ సహకారంతో పరీక్షను జూన్ 21వ తేదీన విజయవంతంగా నిర్వహించినట్లు ప్రధాన్ తెలిపారు.ముందు నుంచి ఈ సంక్షోభానికి బాధ్యతను ఆమోదిస్తున్నట్లు ఆయన చెప్పారు. బాధ్యతల నుంచి తానేమీ పారిపోయేందుకు ప్రయత్నించలేదన్నారు. ఎగ్జామ్ మాఫియా వల్ల మెరిట్ విద్యార్థులకు అన్యాయం జరగకుండా చూడడమే తన కర్తవ్యంగా పెట్టుకున్నానన్నారు. ఏ విద్యార్థికి కూడా అన్యాయం జరగకుండ చూశానన్నారు. జూలై 16వ తేదీన రిలీజ్ చేసిన నీట్ యూజీ ఫలితాలు సంతృప్తికరంగా ఉన్నాయని, ఎంతో మంది మెరిట్ పేద విద్యార్థులు విజయం సాధించినట్లు చెప్పారు. తన లేఖలో కేంద్ర మంత్రులకు, అధికారులకు, విద్యాశాఖ సిబ్బందికి, తనతో పనిచేసిన వారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. దేశానికి సేవ చేయడమే తన జీవితంలో అత్యధిక ప్రాధాన్యమైందని, దేశ సేవకే అంకితమైనట్లు ఆయన తన లేఖలో చెప్పారు. ప్రధాని మోదీకి రాసిన రాజీనామా లేఖను ప్రభుత్వం ఆమోదించాల్సి ఉంది.



## ప్రజాస్వామ్యం గెలిచింది... విద్యార్థుల సామూహిక సంకల్ప విజయమిది

### అభిజీత్ దీప్కే

**న్యూఢిల్లీ:** విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే హర్షం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యం, విద్యార్థులు సాధించిన విజయంగా పేర్కొన్నారు. నీట్ పేపర్ లీక్ వివాదంపై కొన్ని వారాలుగా కొనసాగిన నిరసనల ఫలితంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకునేలా విద్యార్థులు ఒత్తిడి తెచ్చారని అన్నారు. ప్రజాస్వామ్య విలువలకు, దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థుల సామూహిక సంకల్పానికి లభించిన విజయమని ఆయన అభివర్ణించారు.కాగా, నిరంతర శాంతియుత నిరసనలు మార్పును తీసుకురాగలవని చెప్పడానికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ఒక నిదర్శనమని అభిజీత్ దిప్కే తెలిపారు. 'ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. మీరు భయపడకపోతే, ఈ ప్రభుత్వానికి తలొగ్గకపోతే, మనం ఎవరితోనైనా రాజీనామా



చేయించగలమని చెప్పడానికి ఇది నిదర్శనం' అని అన్నారు.అలాగే నీట్ పేపర్ లీక్ వివాదం తర్వాత ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల పేర్లను దీప్కే గుర్తు చేసుకున్నారు. వారి స్మృతి కోసం రెండు నిమిషాల పాటు మౌనం పాటించాలని నిరసనకారులను కోరారు. అనంతరం ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై నిరసన ప్రాంగణంలో విద్యార్థుల సంబరాలు హోరెత్తాయి.

## హర్షం వ్యక్తం చేసిన వాంగ్‌చుక్

**సన్యూఢిల్లీ, జులై 25:** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై సామా జిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ హర్షం వ్యక్తం చేశారు. ఇది పట్టుదలతో యువత సాధించిన విజయని పేర్కొన్నారు. జెన్-జీ, సీజేపీ ప్రతినిధులకు అభినందనలు తెలి యజేశారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో శనివారం ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టు లో..'ఇది ప్రజాస్వామ్యం సాధించిన విజయం. ఇది శాంతి, ఓర్పు, నిరంతర పట్టు దలల విజయం. దేశంలోని సీజేపీ, జెన్ జీ యువతకు అభినందనలు. భయాన్ని వీడి దేశం నలుమూలల నుంచి పోరాటానికి కదలివచ్చిన పౌరులందరికీ ధన్యవాదాలు. ఇప్పటివరకు బాధ్యతాయుతమైన సమాధానం కోరాం. ఇకపై సంస్కరణల వైపు సాగుదాం' అని రాసుకొచ్చారు.



## కేంద్రానికి యువత గుణపాఠం చెప్పింది : ప్రియాంక గాంధీ


కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంపై కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ హర్షం వ్యక్తం చేశారు. ఇది దేశ యువత సాధించిన విజయమని ఆమె పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల ఆకాంక్షలే అంతిమమని, యువత తమ గళాన్ని వినిపించి కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం చెప్పిందని అన్నారు. విద్యా వ్యవస్థలో నెలకొన్న సమస్యలపై విద్యా ర్థులు చేసిన పోరాటం ఫలించిందని ప్రియాంక గాంధీ వ్యాఖ్యానించారు.



### విద్యార్థుల విజయం : ఖర్గే

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా ఈ అంశంపై స్పందిస్తూ.. ఇది కోట్లాది మంది విద్యార్థుల విజయమని తెలిపారు. విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావాలనే లక్ష్యంతో విద్యార్థులు పెద్ద ఎత్తున ఉద్యమించారని, వారి పోరాటం దేశవ్యాప్తంగా చర్చకు దారితీసిందని అన్నారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం మరింత బాధ్యతగా వ్యవహరించాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. విద్యా వ్యవస్థలో పారదర్శకత, నాణ్యత పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

### పోరాటం చేసిన విద్యార్థులకు హ్యాట్సాఫ్ : రాహుల్ గాంధీ



కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ స్పందించారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా ఉద్యమించిన విద్యార్థులకు హ్యాట్సాఫ్ చెబుతూ, వారే నిజమైన దేశభక్తులని కొనియాడారు. విద్యార్థులు తమ హక్కుల కోసం, పారదర్శకమైన విద్యా వ్యవస్థ కోసం చేసిన పోరాటం దేశ ప్రజాస్వామ్య స్ఫూర్తికి నిదర్శన మని రాహుల్ పేర్కొన్నారు. వారి ఐక్యత, పట్టుదల చూస్తే గర్వంగా ఉందని ఆయన అన్నారు.ఈ పరిణామం విద్యారంగంలో సంస్కరణలకు దారి తీస్తుందని ఆశా భావం వ్యక్తం చేశారు. 'విద్యార్థులపై ఎవరైతే దాడి చేసి, వారిని కొట్టి, వారిపై కాల్పులు జరి పారో, వారందరికీ శిక్ష పడాల్సిందే. ఈ విషయాన్ని ప్రభుత్వానికి మరోసారి గుర్తు చేస్తున్నాను' అని రాహుల్ పేర్కొన్నారు. అలాగే, దేశ విద్యార్థుల గౌరవం, వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని భారత ప్రధానమంత్రి దాడులకు గురైన విద్యా ర్థులకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థుల ఆకాంక్షలను గౌరవిస్తూ ప్రభుత్వం విద్యా వ్యవస్థను మరింత పారదర్శకంగా, బాధ్యతాయుతంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని రాహుల్ గాంధీ సూచించారు.

## దేవేంద్ర ఫడణవీస్‌కు విద్యాశాఖ?

### ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో మారుతున్న పరిణామాలు



మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తరువాత న్యూఢిల్లీలో వేగంగా మారుతు న్నాయి. ఢిల్లీ రావాలని మహారాష్ట్ర సీఎం ఫడణవీస్‌కు అధిష్టానం నుంచి పిలుపు వచ్చింది. సీఎంతో పాటు డిప్యూటీ సీఎం షిండేకు కూడా ఢిల్లీ పెద్దల పిలుపు వచ్చింది. కీలక నేతలకు హైకమాండ్ పిలుపుతో రాజకీయాల్లో ఉత్కంఠ నెలకొంది. కీలక మార్పు లకు కేంద్రం సిద్ధం అవుతోందా? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఈ దిశగా శివసేన ఉద్ధవ్ వర్గం నేత సంజయ్ రౌత్ కీలక వ్యాఖ్యలు చేశారు. మహారాష్ట్రలో సీఎం మార్పు జరుగబోతోందని అన్నారు. ఫడణవీస్‌కు కేంద్ర విద్యాశాఖను ఇవ్వబోతున్నారని చెప్పా రు. కేంద్ర మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణ కొంత కాలంగా వాయిదా పడుతున్న విషయం తెలిసిం దే. పార్లమెంటు వర్షాకాల సమావేశాల ప్రారంభానికి ముందే ఇందుకు సంబంధించిన కసరత్తు పూర్తి చేయాలని కేంద్రం భావించినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువ డ్డాయి. అయితే, ప్రధాని విదేశీ పర్యటనల కారణంగా ఈ ప్రక్రియ కొంతకాలం పాటు వాయిదా పడినట్టు సమాచారం. ఇక పునర్‌వ్యవస్థీకరణలో భాగంగా ప్రధాన్ సహా ఇతర మంత్రులు తప్పుకునే అవకాశం ఉన్నట్టు వార్తలు వచ్చాయి. ఈలోపు విద్యార్థుల నిరసనలు మిన్నంటాయి. విపక్షలా నిరసనల నేపథ్యంలో గత కొన్ని రోజులుగా పార్లమెంటు కూడా ఎలాంటి కార్యకలాపాలు జరగకుండానే వాయిదా పడుతోంది. తాజాగా విద్యాశాఖ మంత్రి తప్పుకోవడంతో ఆ శాఖ ఎవరికి కేటాయి స్తారన్న ఉత్కంఠ మొదలైంది. ఇతర ప్రభుత్వ శాఖల విషయంలో ప్రభుత్వం ఏదైనా నిర్ణయం తీసుకుంటుందా అన్న చర్చ జరు గుతోంది. నిన్న రాత్రి కేంద్రం 12 శాఖల సెక్రట రీలకు స్థాన చలనం కలిగించింది. వారిలో విద్యాశాఖ సెక్రటరీ కూడా ఉన్నారు. దీంతో, మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణపై కేంద్రం పూర్తిస్థాయి దృష్టి పెట్టనుందా? అన్న చర్చ జరుగుతోంది.

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల విజయమే : మంత్రి పొన్నం

**హైదరాబాద్, జులై 25:** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల సుదీర్ఘ ఉద్యమానికి దక్కిన విజయమని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. విద్యార్థుల డిమాండ్లపై కేంద్రం దిగివచ్చిందని, ఈ పరిణామం ప్రభుత్వాలకు ఒక కనువిప్పుగా మారాలన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల ఉద్యమానికి దక్కిన విజయమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. విద్యార్థుల హక్కులు, వారి భవిష్యత్తు కోసం దేశవ్యాప్తంగా వ్యక్తమైన ఆందోళనల ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గాల్సి వచ్చిందని ఆయన అన్నారు.విద్యార్థుల ఆవేదనను పట్టించుకోకుండా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరు తీవ్ర విమర్శలకు గురైందని, చివరకు ప్రజల ఒత్తిడి ముందు తలవంచక తప్పలేదని వ్యాఖ్యానించారు. ఇది కేవలం ఒక మంత్రి రాజీనామా మాత్రమే కాదని, ప్రజల గొంతుకకు లభించిన గౌరవమని పొన్నం ప్రభాకర్ అభిప్రాయపడ్డారు. ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేస్తే ఎంతటి ప్రభుత్వమైనా మూల్యం చెల్లించుకోక తప్పదని పేర్కొన్నారు. ఈ రోజు దిగివచ్చిన ప్రభుత్వం రేపు గద్దె దిగక తప్పదని కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. విద్యార్థుల ఆకాంక్షలను విస్మరించిన ప్రభుత్వాలకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు.

### ఇది విద్యార్థుల విజయమే : టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల ఉద్యమానికి, కాంగ్రెస్ పార్టీతో పాటు బీజేపీయేతర రాజకీయ పక్షాల పోరాటానికి దక్కిన విజయమని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. విద్యార్థుల భవిష్యత్‌కు సంబంధించిన అంశాల్లో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిం చడంతో దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువె త్తాయని, వాటి ఫలితంగానే ఈ పరిస్థితి వచ్చిందన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల గొంతుకను ప్రభుత్వం గౌరవించక తప్పదని, విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

### బీజేపీ పతనం ప్రారంభమైంది : మంత్రి అడ్లూరి లక్ష్మణ్

కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా దేశ విద్యార్థులు, యువత పోరాటానికి దక్కిన విజయమని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. ఈ పరిణామంతో బీజేపీ పతనం ప్రారంభమైందని వ్యాఖ్యానించారు. విద్యార్థుల సమస్యలపై కేంద్ర ప్రభుత్వం స్పందించాలని, నీట్



ప్రశ్నపత్రాల లీక్‌పై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. యువతకు న్యాయం జరిగే వరకు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. విద్యార్థుల సమస్యలను అర్థం చేసుకుని పరీక్షల నిర్వహణలో లోపాలను సరిదిద్దాలని కేంద్రాన్ని కోరారు.

Publisher, Editor and Owned by Manasani Krishna Reddy, H No 4-81/1, Ramagundam, Elkalpalli, Karimnagar, Telangana - 505208.
Cell No - 8074124190 Editor : MANASANI KRISHNA REDDY

# బైరాపూర్ ఆలయానికి భక్తుల తాకిడి

**తొలి ఏకాదశి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు**

వాస్తవం : బాన్సువాడ

బాన్సువాడ నియోజకవర్గంలోని బీర్కూర్ మండలం బైరాపూర్ గ్రామంలోని రుక్మిణి విఠలేశ్వర మందిరంలో తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తుల సందడి నెలకొంది. ఆషాఢ శుద్ధ ఏకాదశి పర్వదినం సందర్భంగా నిర్వహించే తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని విట్టల రుక్మిణి స్వామి వారి ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. తెల్లవారుజాము నుంచి ఆలయానికి చేరుకున్న భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో భజనలు, హరి నామ సంకీర్తన లు భక్తులను ఆధ్యాత్మిక వాతావరణంలో ముంచెత్తాయి. ఆయా గ్రామాలనుంచి భక్తులు పాదయాత్రగా విచ్చేసి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ శాశ్వత అధ్యక్షులు ద్రోణవల్లి సతీష్ మాట్లాడుతూ ప్రతి ఏటా ఆలయంలో భక్తుల సందడి నెలకొంటుందని ముఖ్యంగా పర్వదినాల్లో ఆలయానికి భక్తుల తాకిడి అధికంగా ఉంటుందని అన్నారు ఈ సందర్భంగా భక్తులందరికీ తొలి ఏకాదశి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆలయ ఆవరణలో ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తులకు అల్పాహారం (బగరా)కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆదివారం రోజున అన్నదాన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తామని అన్నారు. సుమారు శనివారం రోజున పదివేల మంది వరకు ఆలయంలో దర్శించుకున్నారని అన్నారు. ఉమ్మడి నిజాంబాద్ జిల్లాతో పాటు పక్క జిల్లాల నుంచి కాకుండా పక్కనే గల కర్ణాటక మహారాష్ట్ర నుంచి భక్తులు విచ్చేసి ఆలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. విట్టల రుక్మిణి మాత ఆలయానికి విచ్చేసిన భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశామని అన్నారు. ఆలయంలో స్వామివారు అమ్మవారిని దర్శించడానికి భక్తులు అధిక సంఖ్యలో క్యూ లైన్ లో నిలబడ్డారు. ఆలయ ఆవరణలో చిన్నపాటి జాతరను ఏర్పాటు చేశారు. మహారాష్ట్రలోని పుణ్యక్షేత్రం పండరీపూర్ కు వెళ్లలేని భక్తులు బైరాపూర్ ఆలయానికి విచ్చేసి విట్టల రుక్మిణి మాతను దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలోని ఉసిరి చెట్టుకు మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించి దీపారాధన చేశారు. తొలి ఏకాదశి రోజున విట్టల రుక్మిణి దర్శనం చేసుకోవడం వల్ల సర్వ పాపాలు తొలగి ఆయురారోగ్యాలు ఐశ్వర్యం శాంతి చేకూరుతాయని భక్తుల విశ్వాసం. వర్షాలు సమృద్ధిగా కృషి పాడి





పంటలు బాగా పండి అందరూ సుఖ సంతోషాలతో జీవించేలా స్వామి వారి ఆశీర్వదించాలని భక్తులు కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి స్వరూప శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## శాంతి భద్రతల పరిరక్షణ కొరకే కమ్యూనిటీ కాంటాక్ట్

**సాంఘిక కార్యకలపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు**

**స్వీయారక్షణార్థం కాలనిలలో**

**సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి**

**అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు**

**సమాచారం ఇవ్వండి**

**సరైన పత్రాలు లేని 60 ద్విచక్ర వాహనాలు,**

**3 లీటర్ల మద్యం స్వాధీనం**

**సిరిసిల్ల డిఎస్పీ కె నాగేంద్రచారి**

వాస్తవం: సిరిసిల్ల

జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే ఆదేశాల మేరకు శనివారం సిరిసిల్ల డీఎస్పీ కె నాగేంద్ర చారి ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణంలోని రాజీవ్ నగర్‌లో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సరైన పత్రాలు, నంబర్ ప్లేట్లు లేని 60 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని, సంబంధిత యజమానులు అవసరమైన పత్రాలు సమర్పించి వాహనాలను తీసుకెళ్లాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న కొక్కుల ఆంజనేయులుపై కేసు నమోదు చేసి,3 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. నేరాల నియంత్రణలో భాగంగా పోలీసులు అనుమానిత వ్యక్తులను తనిఖీ చేసి, వారి ప్రస్తుత కదలికలు, స్థితిగతులపై ఆరా తీశారు. ప్రస్తుతం వారు ఎలాంటి ఉపాధి చేస్తున్నారు, ఎక్కడ నివాసం ఉంటున్నారు,అనే వివరాలను సేకరించి, చట్టవ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడకుండా ఉండాలని సూచించారు. ప్రజల రక్షణతో పాటు వారికి భద్రతాభావం కల్పించడం, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డీఎస్పీ నాగేంద్రచారి తెలిపారు. ఈ



కార్యక్రమం ద్వారా ప్రాంతాల్లోకి కొత్తగా వచ్చే వ్యక్తులు లేదా నేరస్తులు షెల్టర్ తీసుకుంటున్నారా అనే విషయాలు కూడా గుర్తించే అవకాశం ఉంటుందన్నారు. అలాగే స్వీయ రక్షణ కోసం కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఈ విషయంలో పోలీస్ శాఖ పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. భద్రతా పరమైన అంశాల్లో, నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. కాలనిలలో ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. యువత అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని,తల్లిదండ్రులు తమ పిల్లలను చదువుపై దృష్టి పెట్టేలా ప్రోత్సహించాలని సూచించారు. గంజాయి అక్రమ రవాణా,నిల్వ, సరఫరా వంటి అంశాలపై ఎవరైనా సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని హామీ ఇచ్చారు. ఎవరైనా ప్రజా జీవనానికి భంగం కలిగించిన, చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడిన చట్టపరమైన కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో పట్టణ సిఐ శ్రీనివాస్, ఎస్ఐ లు నాగరాజు, గణేష్, రంజిత్, ఆర్ఎస్ఐ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

## శుభాకాంక్షలు తెలిపిన నవీన్ పోగుల



వాస్తవం : జూబ్లీహిల్స్

తొలి ఏకాదశి పండుగని శయని ఏకాదశి లేక ఆషాఢ ఏకాదశి అని అంటారు .హిందూ సాంప్రదాయాల్లో అత్యంత పవిత్రమైన పండుగల లో ఒకటి, ఆషాఢ మాసంలోని శుక్లపక్ష ఏకాదశి రోజున ఈ పండుగను జరుపుకుంటారు. ఈ పండుగ విశిష్టత గురించి పురాణాలలోకి వెళ్తే శ్రీమహావిష్ణువు క్షీరసాగరంలో శేషతల్పంపై యోగా నిద్ర లోకి వెళ్లాడని నమ్ముతారు. అందుకే దీనిని ఏకాదశి లేక తొలి ఏకాదశి అని అంటారు. అటువంటి తొలి ఏకాదశి పండుగ రోజు అయిన శనివారం జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఇంచార్జ్ మాగంటి సునీత గోపీనాథ్ కి వారి క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి తొలి ఏకాదశి శుభాకాంక్షలు తెలిపారు బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, న్యాయవాది నవీన్ పోగుల. ఈ సందర్భంగా మాగంటి సునీతమాట్లాడుతూ జూబ్లీహిల్స్ నియోజకవర్గం లోని ప్రజలందరికీ తొలి ఏకాదశి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బి .ఆర్. ఎస్. పార్టీ సీనియర్ నాయకులు అజయ చౌదరి, నాగరాజు,తేజ,హర్షద్,విశాల్,ఫిరోజ్ శివయ్య పాల్గొన్నారు.

## సైబరాబాద్‌లో షీ టీమ్స్ విస్తృత తనిఖీలు

**15 మంది ఈవ్‌టీజర్ల పట్టివేత**

వాస్తవం ఆర్ సీ : కుత్బుల్లాపూర్

మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ సైబరాబాద్ మహిళా & శిశు భద్రత విభాగం ఆధ్వర్యంలోని షీ టీమ్స్ జూలై 18 నుంచి 24 వరకు విస్తృత తనిఖీలు నిర్వహించాయి. ఈ సందర్భంగా మొత్తం 118 డీకాయ్ ఆపరేషన్లు నిర్వహించి, బహిరంగ ప్రదేశాల్లో మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన 15 మందిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వీరిలో 11 మందిపై పెటీ కేసులు నమోదు చేయగా, మిగిలిన వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. అలాగే మహిళల నుంచి వివిధ మార్గాల ద్వారా 20 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు.ఇదే సమయంలో 'ఆపరేషన్ ముస్కాన్'లో భాగంగా సైబరాబాద్ యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ (ఏ ఎచ్ టీ యు) 24 జువెనైల్ జస్టిస్ చట్టం, బాల కార్మిక కేసులు నమోదు చేసి, మొత్తం 127 మంది చిన్నారులను రక్షించింది. వీరిలో 122 మంది బాలురు, 5 మంది బాలికలు ఉన్నారు. కుటుంబ విభేదాల పరిష్కారానికి ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్లు, సీ డి ఈ డబ్ల్యు కేంద్రాల ద్వారా 23 కుటుంబాలను తిరిగి కలిపేందుకు అధికారులు విజయవంతంగా కృషి చేశారు. అదేవిధంగా మహిళలు, చిన్నారుల్లో అవగాహన పెంపొందించేందుకు సైబరాబాద్ పరిధిలోని పలు ప్రాంతాల్లో షీ టీమ్స్, ఏ ఎచ్ టీ యు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో 3,493 మంది పాల్గొన్నారు. మానవ అక్రమ రవాణా, బాలల అక్రమ రవాణా, ఈవ్‌టీజింగ్, సోషల్ మీడియా వేధింపులు, బాల్య వివాహాలు, బాలల హక్కులు, బాల కార్మిక వ్యవస్థ, స్టాకింగ్, సైబర్ బులీయింగ్, సైబర్ మోసాలు, మహిళల హెల్ప్




లైన్ 181, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, అత్యవసర సేవల 100/112, సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930 తదితర అంశాలపై అవగాహన కల్పించినట్లు మహిళా & శిశు భద్రత విభాగం వెల్లడించింది.

# డివిజన్లోని సమస్యలపై కమిషనర్ కివినతి పత్రం

### 38వ డివిజన్ కార్పొరేటర్ నెలకంటి

**వాస్తవం : గోదావరిఖని**



38వ డివిజన్ పర్యటనకు వచ్చిన అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు) రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అరుణ శ్రీ ... డివిజన్ లో పలు అభివృద్ధి గురించి మరియు డివిజన్లోని సమస్యలపై ఈరోజు కమిషనర్ కి వినతి పత్రం అందించిన 38వ డివిజన్ కార్పొరేటర్ నెలకంటి డివిజన్లో సింగరేణి కాలనీ ఉన్నది ఈ కాలనీలో సింగరేణి సంస్థఅధ్య ర్యంలో చేపట్టిన పారిశుద్ధ్య పనులు ఇతర పనుల్లో జాప్యం కారణంగా కాలనీక కుంటుంబాలుకాలనీవాసులు తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారు ముఖ్యంగా హనుమాన్నగర్లో కాలనీక వాడల్లో ప్రతి నిత్యం చెత్తను తొలగించకపోవడంతో చెత్త పేరుకుపోతుంది అలాగే కాలనీ మధ్యలో చెత్త డబ్బా ఏర్పాటు చేయడంతో ఆ ప్రాంతమంతా దుర్గంధంగా మారు తుంది వెంటనే చెత్త డబ్బాను తొలగించాలిహనుమాన్నగ ర్లో ఇరు లైన్లలో నాటిన రోడ్డు నిర్మాణం చేయాల్సి ఉండగా మూడు లైన్ల రోడ్డునిర్మించి రెండు లైన్ల పరివర్తనం జరిగింది వెంటనే రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలిఅలాగే అంబేద్కర్ నగర్ మల్లికార్జున్ నగర్ సీతానగర్ లలో ఇండ్లపై నుంచి సింగరేణికి చెందిన విద్యుత్ లైన్లు వెళ్తూఉన్నాయి ఈ లైన్లతో కాలనీవాసులకు ముప్పు ఉందని తొలగించాలని కాలనీవా సులు చాలా కాలంగాకోరుతున్నప్పటికీ ఇప్పటి వరకు తొల గించలేదు దీనితో భయం గుప్పిట్లో ప్రజలు ఉన్నారు వీలై నంత త్వరగా సింగరేణి విద్యుత్ వైర్లు ఇండ్లపై నుంచి తొల గించేలా చర్యలు తీసుకోగలరు కోరారు డివిజన్లోని పలు స మస్యలను వారికి వివరించడం జరిగింది కమిషనర్ తక్షణ మే వాటన్నిటిని పూర్తి చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో బొంత వెంకటేష్ బొమ్మ ఎల్ల గౌడ్ దాసరి దుర్గ దాసరి వెంకట్ వర్డ్ ఆఫీసర్ సాయి కృష్ణ, వార్డ్ అసిస్టెం ట్ వాణీ,శ్రా సరస్వతి డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

## అమీన్ పూర్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన ఎమ్మెల్యే జిఎంఆర్

**అర్హులైన ప్రతి ఓటరు ఎస్ఐఆర్ ప్రక్రియలో పాల్గొనాలని విజ్ఞప్తి**

**వాస్తవం : అమీన్ పూర్**



కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న ఎస్ఐఆర్ ( ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ) లో అర్హులైన ప్రతి ఓటరు తమ వివరాలు సమర్పించి పటాన్ చెరు అభివృద్ధిలో భాగస్వాములు కావాలని స్థానిక శాసనసభ్యులు గూడెం మ హిపాల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. అమీన్ పూర్ డివిజన్ పరిధిలో ని పీజేఆర్ కాలనీలో చేపడుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను శని వారం ఉదయం ఆయన స్వయంగా పరిశీలించారు. అధికా రులను అడిగి వివరాలను తెలుసుకున్నారు. సాఫ్ట్ వేర్, ఫార్మా ఉద్యోగులు అధికంగా నివసించే గేటెడ్ కమ్యూనిటీలు, అపా ర్ట్మెంట్లు,కాలనీలలో ఎస్ఐఆర్ ప్రక్రియపై మరింత అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. జులై 25 వ తేదీ వరకు 59 శాతం మాత్రమే నమోదు కావడం జరిగిందని.. మరో 20 శాతం వరకు పెంచేందుకు కృషి చేయాలని కోరా రు.ఒక ప్రాంతం అభివృద్ధి చెందాలంటే ఓటు హక్కు అత్యంత కీలకమని ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కలిగి ఉండడం ప్ర తి ఒక్కరి బాధ్యత అని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పై అవగాహన కల్పించడంలో భాగంగా బిఆర్ఎస్ పార్టీ ఆధ్వ ర్యంలో అవగాహన సదస్సులు, ప్రచార వాహనాలు, సోషల్ మీడియా ద్వారా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపా రు. ఈ కార్యక్రమంలో అమీన్ పూర్ సర్కిల్ డిప్యూటీ కమిష నర్ ప్రదీప్ కుమార్, మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాం డురంగా రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నరసింహా గౌడ్, మాజీ ప్రజా ప్రతినిధులు మహాదేవ రెడ్డి,కృష్ణ,ప్రమోద్ రెడ్డి, చంద్రశే ఖర్,దాసు,జగదీష్,అధికారులు మనోహర్,నరసింహ, అమరేం దర్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారి విస్తరణలో నష్టపోయే ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తాం

### రుద్రారం గ్రామస్తులతో ఎమ్మెల్యే జిఎంఆర్

**వాస్తవం : పటాన్ చెరు**



జాతీయ రహదారి 65 విస్తరణలో భాగంగా ఇస్నాపూర్ ము న్సిపల్ పరిధిలోని రుద్రారం గ్రామంలో ప్రజలకు నష్టం కల గకుండా చర్యలు చేపట్టడంతో పాటు.. విస్తరణలో ఆస్తులు కోల్పోయే ప్రతి ఒక్కరికి సంపూర్ణ న్యాయం చేస్తామని పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి హామీ ఇచ్చారు. అతి త్వరలో జాతీయ రహదారుల సంస్థ ఈఎన్సి ధర్మారెడ్డి, జిల్లా కలెక్టర్ లతో కలిసి రుద్రారం గ్రామంలోనే సమావేశం ఏర్పాటు చేసి శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టబోతు న్నట్లు తెలిపారు. శనివారం సాయంత్రం రుద్రారం గ్రామం లోని వార్డు కార్యాలయంలో జాతీయ రహదారుల సంస్థ అధి కారులు,స్థానిక కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధులు,గ్రామస్తుల తో ఎమ్మెల్యే జిఎంఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్తులు విస్తరణ మూలంగా తాము ఎదుర్కొనబోయే నష్టా లను వివరించారు. రోడ్డు విస్తరణ ప్రారంభించే సమయం లో ఇరువైపులా 50 ఫీట్ల చొప్పున విస్తరణ పనులు చేపడతా మని చెప్పి.. నేడు 75 గజాలు నిర్ణయించడం సరికాదని వా రు ఎమ్మెల్యే జిఎంఆర్ దృష్టికి తీసుకెళ్లారు. దీని మూలంగా గ్రామస్తులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నా రు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే జిఎంఆ ర్.. ప్రజల విజ్ఞప్తి మేరకు అతి త్వరలో జాతీయ రహదారుల సంస్థ ఈఎన్సి ధర్మారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతి జనులకు కలిసి గ్రామ వార్డు కార్యాలయంలోనే గ్రామస్తుల సమక్షంలో సమా వేశము ఏర్పాటు చేసి శాశ్వత పరిష్కారం చూపెదతామని హామీ ఇచ్చారు. ప్రధానంగా నష్టపోయే నిర్మాణానికి పరిహా రంతో పాటు మరోచోట ప్లాట్ కేటాయింపు, మిగిలిన స్థలాల కు ప్రభుత్వ అనుమతులు ఇచ్చేలా కృషి చేస్తానని హామీ ఇ చ్చారు.ఈ సమావేశంలో డిఈ సందీప్, శ్రీకాంత్, సీనియర్ నాయకులు, కౌన్సిలర్ పాండు, కౌన్సిలర్లు వెంకటేష్, రాజు, సందీప్ గౌడ్, మాజీ సర్పంచ్ సుధీర్ రెడ్డి, సిద్ధి వినాయక దేవాలయం కమిటీ చైర్మన్ హరి ప్రసాద్ రెడ్డి, మన్నె రాజు, బలరాం, గ్రామస్తులు పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు

**కిటకిటలాడిన దేవాలయాలు**

**వాస్తవం : అందోల్**



తొలి ఏకాదశి పర్వ ది నాని పురస్కరించుకొని ఆందోల్ మం దలం లోని గ్రామ గ్రామాలలో భక్తులు భక్తిశ్రద్ధలతో దేవుళ్లను కొలిచారు. ముఖ్యంగా శైవ క్షేత్రా లలో భక్తులు ఉదయం నుండే బార్లు తీరి భగ వంతుని దర్శించుకున్నారు.ముఖ్యంగా అందోల్‌లోని రంగనాథస్వామి ఆలయంలో, వైకుంఠపురం లో నీ వెంకటేశ్వరుని భక్తులు వేలాదిగా వచ్చి దర్శించుకు న్నారు . ఆయా దేవాలయాలలో ఓం నమో నారా యణాయ నమః అనే నినాదాలు మార్మోగాయి

## నర్సింగాపూర్ గ్రామ సర్పంచ్‌కి సన్మానం



**వాస్తవం : చందుర్తి**

ప్రముఖ కవి,బహుభాషావేత్త,భారత ఆర్మీ జూనియర్ అధికా రి,మై గిఫ్ట్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ పెరుక రాజు స్వగ్రామమైన చందుర్తి మండలం నర్సింగాపూర్ గ్రా మానికి రాగా,గ్రామ నూతన సర్పంచిగా ఎన్నికైన మరాఠి మల్లిక్ ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపా రు.శాలువాతో ఘనంగా సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశా రు.అనంతరం తన 13వ భారతీయ భాషల అనువాద కథ ల సంపుటిని బహుకరించారు.అనూహ్యంగా వచ్చి సన్మానిం చినందుకు సర్పంచ్ మరాఠి మల్లిక్ పెరుక రాజుకు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా డాక్టర్ పెరుక రాజు మాట్లాడుతూ...ఎన్నికల సమయంలో పార్టీలు వేరైనా ప్రజాసేవలో మాత్రం అందరు ఒక్కటే.గ్రామ అభివృద్ధే అంద రి లక్ష్యం కావాలని,మానవత్వ సత్యాన్ని అందరు ఆచరించా లని సూచించారు.ఈ కార్యక్రమంలో కుంట లచ్చయ్య, పెరు క శ్రీను, మెరుపుల శంకర్, ఇరుకుల్ల సురేష్,డి మోహన్, సురువు జలి తదితరులు పాల్గొన్నారు.

**ఎంపీ రఘునందన్ రావును**

## కలిసిన బిజెపి నాయకులు



**వాస్తవం : మనోహరాబాద్**

సిద్దిపేట జిల్లా బిజెపి అధ్యక్షులు బైరి శంకర్ ముదిరాజ్, ప్ర ధాన కార్యదర్శి నత్తి మల్లేష్ ముదిరాజ్ ల ఆధ్వర్యంలో నూత నంగా ఎన్నికైన సిద్దిపేట జిల్లా బిజెపి కమిటీ కార్యవర్గ సభ్యు లంతా కలిసి శనివారం ఎంపీ రఘునందన్ రావును హైదరా బాద్‌లోని వారి నివాసంలో పూర్వకంగా కలిసి ప్రత్యేక కృత జ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా రఘునందన్ రావు కమిటీ సభ్యులందరిని శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపా రు.పార్టీ అభివృద్ధికి అహర్నిశలు కష్టపడి పని చేయాలని కమిటీ సభ్యులకు సూచించారు.ఈ కార్యక్రమంలో విభీషణ్ రెడ్డి,ఖమ్మం వేంకటేశం,జిల్లా ఉపాధ్యక్షుడులు టేకుల పల్లి బాల్ రెడ్డి,మాచర్ల కుమారస్వామి కట్ట భాగ్యలక్ష్మి,కార్యదర్శి ఎల్కంటి సురేష్,ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సునవత్ మోహన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

**ఎల్ నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని**

## ఆరతడి పంటలు పండించాలి



**వాస్తవం : తిరుమలగిరి**

తిరుమలగిరి మండలం మొండి చింత తొండ గ్రామపంచా యతీ ఆవరణలో గ్రామ సర్పంచ్ అధ్యక్షతన ఆరు తడి పం టలపై రైతులకు అవగాహన నిర్వహించారు.మండల వ్యవ సాయ అధికారి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎల్ నినో ప్రభా వం దృష్ట్యా రైతులు నీటి వినియోగం తక్కువగా ఉండే ఆరుత డి పంటల సాగుపైనే ప్రధానంగా దృష్టి సారించాలని కోరా రు. ఎల్ నినో కారణంగా రాబోయే కాలంలో వర్షాభావ పరిస్ థితులు ఏర్పడే అవకాశం ఉందన్నారు. సంప్రదాయ పద్ధతిలో ఎక్కువ నీరు అవసరమయ్యే పంటలు వేసి నష్టపోవడం కం టే, ప్రభుత్వ సూచనలు మరియు వ్యవసాయ అధికారుల సల హాలు పాటిస్తూ ఆరుతడి పంటలను సాగు చేయాలని సూచిం చారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీలత బాలాజీ, పి ఏసిఎస్ డైరెక్టర్ లావుడ్య వెంకన్న,ఏఈఓ భవ్య,రైతు ప్రతినిధు లు, పాలకవర్గ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

# సింగరేణిలో ఏఐటియుసిది రక్త తర్పణ చరిత్ర

**వాస్తవం : గోదావరిఖని**

సింగరేణిలో ఏఐటియుసి ది కొత్త చరిత్ర కాదని రక్త తర్పణ చరిత్ర అని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐట యుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్ కేంద్ర కార్య దర్శి కవ్వంపల్లి స్వామి లు పేర్కొన్నారుసింగరేణి ఆర్జీ వన్ ఏరియా లోని జిడికె వన్ సి హెచ్ పి లో శనివారం జరిగిన గేట్ మీటింగ్ లో వారు మాట్లాడుతూ సోషల్ మీడియాలో హెచ్ ఎం ఎస్ యూనియన్ ఏఐటియుసి పై మరియు నా యకుల పై అభ్యంతరకరమైన పోస్టులు పెట్టడం కార్మిక వ్య తిరేక చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు సింగరేణిలో ఏఐ టియుసి యూనియన్ కార్మిక హక్కుల కోసం సంస్థ పరిరక్షణ కోసం గత ఎనభై ఏండ్లకు పైగా అనేక పోరాటాలు ఉద్యమా లు చేసి సంఘ విద్రోహుల చేతిలో నాయకులు బలిదానం అయ్యారని తమ రక్తాన్ని ధారపోసి తమ జీవితాలను త్యాగం చేశారని వారు గుర్తు చేశారు సోషల్ మీడియాలో అభ్యంతరక రమైన పోస్టులు పెడుతూ కార్మికులను తప్పుదోవ పట్టిస్తున్న



హెచ్ ఎం ఎస్ యూనియన్ కార్మికులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని లేకుంటే కార్మికులే తగిన బుద్ధి చెబుతారని వారు హెచ్చరించారు. ఏఐటియుసి ఎప్పుడూ కార్మికుల హక్కుల కోసం, సంస్థ అభివృద్ధి కోసం పోరాడుతుందని వ్యక్తులను టార్గెట్ చేసే దుష్ప్రచారాలను తిప్పికొడతామని స్పష్టం చేశా రు.ఏఐటియుసి సి హెచ్ పి డిపార్ట్మెంట్ కార్యదర్శి బండి మ ల్లేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను మాట్లాడగా నాయకులు సంకె అశోక్ బోగ సతీ ష్ బాబు గండి ప్రసాద్,పెర్క మహేందర్ మానాల శ్రీనివాస్ కారంపూరి వెంకన్న తదితరులు పాల్గొన్నారు

# బోడుప్పల్ సర్కిల్ మేడిపల్లిలో అక్రమ నిర్మాణాల కలకలం

**ఔట్సోర్సింగ్ ఉద్యోగిపై ఆరోపణలు**
**మేడిపల్లి సత్యనారాయణపురంలో గృహ నిర్మాణ అనుమతులతో కమర్షియల్ షెడ్లు, షట్టర్ల నిర్మాణం కొనసాగుతోందంటూ స్థానికుల ఆగ్రహం**
**అక్రమ నిర్మాణాలకు ఔట్సోర్సింగ్ ఉద్యోగి అండ**
**స్థానికుల సంచలన ఆరోపణలు.**
**నిలిపిన నిర్మాణం మళ్లీ ఎలా మొదలైంది**
**బోడుప్పల్ సర్కిల్ టౌన్ ప్లానింగ్‌పై ప్రశ్నల వర్షం**
**సామాన్యుడికి నోటీసులు.. గృహ నిర్మాణ అనుమతులతో కమర్షియల్ నిర్మాణాలకు గ్రీన్ సిగ్నలా**
**బోడుప్పల్ సర్కిల్‌లో అనుమతి నిబంధనల ఉల్లంఘనపై అధికారుల మౌనానికి స్థానికుల ఆగ్రహం**

**మేడిపల్లి : వాస్తవం**








బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని మేడిపల్లి సత్యనారాయణపురం రోడ్ నెం. 2, 3 ప్రాంతాల్లో గృహ నిర్మాణ అనుమతులు తీసుకొని కమర్షియల్ షెడ్లు, షట్టర్ల నిర్మాణాలు కొనసాగిస్తు న్నారని స్థానికులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. గృహ నిర్మా ణానికి మాత్రమే అనుమతులు తీసుకొని, వాస్తవానికి కమర్షి యల్ నిర్మాణాలు చేపడుతున్నారని వారు పేర్కొంటున్నారు. సంబంధిత నిర్మాణాలకు కమర్షియల్ అనుమతులు లేవని చెబుతున్నప్పటికీ, పనులు నిరంతరాయంగా కొనసాగుతుండ టం పై స్థానికంగా తీవ్ర చర్చ జరుగుతోంది.గతంలో ఇదే నిర్మాణాన్ని టౌన్ ప్లానింగ్ అధికారులు నిలిపివేశారని, ప్రస్తు తం అదే నిర్మాణం మళ్లీ ఎలా ప్రారంభమై కొనసాగుతోందో ప్రజలకు సమాధానం చెప్పాలని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన అధికారులు ఈ వ్యవ హారంలో ఎందుకు మౌనం పాటిస్తున్నారని వారు నిలదీస్తు న్నారు.స్థానికుల ఆరోపణల ప్రకారం, ఈ నిర్మాణాలకు ఓ ఔట్సోర్సింగ్ ఉద్యోగి అండదండలు అందిస్తున్నాడని ప్రచారం జరుగుతోంది. నిర్మాణదారులు, అధికారుల మధ్య మధ్యవర్తి త్వం చేస్తూ అధికారుల పేరుతో సెటిల్‌మెంట్లు నిర్వహిస్తున్నా డనే ఆరోపణలు వినిపిస్తున్నాయని స్థానికులు పేర్కొంటున్నా రు. ఈ ప్రచారంపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు."సామాన్య ప్రజలు చిన్నపాటి నిర్మాణం చేపట్టినా వెంటనే నోటీసులు జారీ చేసే అధికారు లు, గృహ నిర్మాణ అనుమతులతో కమర్షియల్ నిర్మాణాలు బహిరంగంగా జరుగుతున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు?" అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అధికారుల సహకా రం లేకుండా ఇలాంటి నిర్మాణాలు కొనసాగడం సాధ్యం కాదని వారు ఆరోపిస్తున్నారు.మేడిపల్లి సత్యనారాయణపురం లో కొనసాగుతున్న ఈ నిర్మాణాలపై వెంటనే పూర్తి స్థాయి విచారణ జరిపి, గృహ నిర్మాణ అనుమతులను దుర్వినియో గం చేసి కమర్షియల్ నిర్మాణాలు చేపట్టినట్లు తేలితే తక్షణమే నిర్మాణాలను నిలిపివేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే ఈ వ్యవహారంలో ఓ ఔట్సోర్సింగ్ ఉద్యోగిపై వస్తున్న ఆరోపణలపై కూడా సమగ్ర విచారణ నిర్వహించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాల ని ఉన్నతాధికారులను కోరుతున్నారు..

# అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే ఫిర్యాదు చేయండి

**వ్యవసాయ అధికారి వేల్పుల పూజ**
**ఎరువుల డీలర్‌కు షోకాజ్ నోటీసు జారీ**

**వాస్తవం, హుస్నాబాద్ :**



అధిక ధరలకు ఎరువులను విక్రయించినట్లయితే వ్యవసాయ అధికా రులకు ఫిర్యాదు చేయాలని వ్యవసాయ అధికారి వేల్పుల పూజ అన్నారు. రైతుల నుండి అందిన ఫిర్యాదుల ఆధారంగా, ఎంఆర్‌పీ (గరిష్ఠ చిల్లర ధర) కంటే అధిక ధరకు యూరియా విక్రయించినట్లు ప్రాథమికంగా నిర్ధారణ కావడంతో హుస్నాబాద్ పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర ఫర్టిలైజర్ ఎరువుల డీలర్‌కు, మండల వ్యవసాయ అధికారి వేల్పుల పూజ షోకాజ్ నోటీసు జారీ చేశారు.ఎరువుల (ని యంత్రణ) ఉత్తర్వులు, 1985 మరియు సంబంధిత నిబంధనల ప్రకారం, నిర్ణయించిన గరిష్ఠ చిల్లర ధర కంటే అధిక ధరకు ఎరు వులు విక్రయించడం చట్టవిరుద్ధం. ఈ విషయమై డీలర్ తన వివ రణను నిర్ణీత గడువులోగా సమర్పించాలని ఆదేశించారు. సమర్పిం చే వివరణ సంతృప్తికరంగా లేకపోతే, సంబంధిత చట్టాల ప్రకారం లైసెన్స్ సస్పెన్షన్/రద్దు సహా తగిన చట్టపరమైన చర్యలు తీసుకోబ డతాయని పేర్కొన్నారు.రైతులు ఎవరైనా ఎంఆర్‌పీ కంటే అధిక ధర కు ఎరువులు విక్రయించినట్లు గమనించినట్లయితే, సంబంధిత ఆధా రాలతో వ్యవసాయ అధికారులకు వెంటనే ఫిర్యాదు చేయాలని విజ్ఞ ప్తి చేశారు.

**వలిగొండ తొర్రూర్ జాతీయ రహదారి పై**

# బ్లాక్ స్పాట్ పరిశీలన



**వాస్తవం : తిరుమలగిరి**

తిరుమలగిరి మండల పరిధిలో వలిగొండ తొర్రూర్ జాతీ య రహదారి (ఎన్ హెచ్ -930పీ) పై బ్లాక్ స్పాట్స్ సమ స్యల పరిష్కారానికి శనివారం తిరుమలగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక క్షేత్రస్థా యి పరిశీలన నిర్వహించారు. తిరుమలగిరి సబ్ ఇన్‌స్పెక్టర్ గుత్త వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో నేషనల్ హైవే ప్రాజెక్ట్ మేనే జర్ బి రామ్‌కుమార్ లతో కలిసి సంయుక్తంగా ఈ తనిఖీ లు చేపట్టారు. ఈ సందర్భంగా తొండ గ్రామం మరియు అనంతారం స్టేజ్ వద్ద గల జాతీయ రహదారి దిగ్బంధన ప్రాంతాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. అక్కడ నెలకొన్న ప్రస్తుత పరిస్థితులను అంచనా వేసి, వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా చేపట్టాల్సిన తాత్కాలిక మరియు శాశ్వత నివారణ చర్యలపై ఎన్‌హెచ్‌ఏఐ అధికారు లు, స్థానిక ప్రజాప్రతినిధులతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు గాను సం బంధిత ప్రభుత్వ శాఖల సమన్వయంతో అవసరమైన అన్ని చర్యలు వేగవంతంగా తీసుకుంటున్నట్లు తిరుమలగిరి పోలీ స్ వర్గాలు తెలిపాయి.

**ఎస్సీ రెడ్డి నరసింహారెడ్డి**

# వర్ధంతి సభ జయప్రదం చేయండి



**వాస్తవం : మద్దూరు**

మంగళవారం చేర్యాల పట్టణంలో నిర్వహించనున్న ఎస్సీ రెడ్డి నరసింహారెడ్డి 35వ వర్ధంతి సభను విజయవంతం చే యాలని మద్దూరు మండల పార్టీ నాయకులు పిలుపునిచ్చా రు.ఈ మేరకు శనివారం మండల కేంద్రంతో పాటు రేపటి గ్రామం,వంగపల్లి,లద్నూరు,ధర్మారం గ్రామాల్లో కార్యకర్తలను కలిసి కరపత్రాలు పంపిణీ చేశారు.అదే రోజు పార్టీ సభ్యుల క్లాస్ కూడా ఉంటుందని, కావున పార్టీ శ్రేణులతో పాటు హమాలీ పెద్ద మనుషులు భారీగా తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యుడు నరదాసు కనక య్య,కొమ్ము భాస్కర్,శ్రీనివాస్,మహేష్,రమేష్,అప్సర్ బాయ్ తదితరులు పాల్గొన్నారు.

**గ్రామస్తుల ఆర్థిక సహాయంతో**

# బస్ సెల్టర్ ఏర్పాటుకు భూమి పూజ



**వాస్తవం : చందుర్తి**

గత కొన్ని సంవత్సరాలుగా మల్యాల గ్రామంలో పాత బస్టాండ్ నిరుప యోగంగా శిథిలావస్థలో ఉందని గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారని దృష్టితో గ్రామ సర్పంచ్, పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు సమక్షంలో సుమారు లక్ష రూపాయల వ్యయంతో వీడీసీ సారథ్యంలో నూతన తా త్కాలిక బస్ షెల్టర్ ఏర్పాటుకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వీడీసీ సభ్యులు మాట్లాడుతూ..పురాతనమైన బస్సు షెల్టర్ శిథిలావస్థ లో ఉండని ప్రయాణిక గ్రామస్తులకు ఇబ్బందని పడుతున్నారని వాట్స ప్ గ్రూపులో విడిసి సభ్యులు గ్రామ ప్రజల దృష్టికి తీసుకెళ్లగా గల్ఫ్ కార్మికులు వీడీసీ పైన అసంచలమైన విశ్వాసంతో ఆర్థిక సహాయం అందించి నిర్మాణం చేపట్టుటకు సహకరించి గ్రామ అభివృద్ధికి స్పం దించిన ప్రతి ఒక్కరికి సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్ర మంలో గ్రామ సర్పంచ్ మాందాల శారద పాలకవర్గ సభ్యులు తూం గణేష్, గుంటపల్లి నారాయణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఈసరి శ్రీనివా స్,మాజీ వైస్ ఎంపీపీ అబ్రహం,వీడిసి సభ్యులు సంటి సుజీవన్, తోగ రి గంగాధర్,యంజాల నరేష్, గుర్రం గంగాధర్,లక్కె బాబు గ్రామస్తు లు సంటి ప్రసాద్,నాయిని రాజిరెడ్డి,మల్లారం నర్సయ్య,పిట్ల రాములు, కొట్టే మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

వాస్తవం



# మోదీ ప్రభుత్వం మెడలు వంచిన కాక్రోచ్ జనతా పార్టీ

భారత రాజకీయ చరిత్రలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు ఎన్నికల్లో ఓటమి చెందడం, ప్రతిపక్షాల ఒత్తిడికి తలవంచడం, న్యాయస్థానాల జోక్యంతో నిర్ణయాలు మార్చుకోవడం వంటి సంఘటనలు ఎన్నో జరిగాయి. కానీ సోషల్ మీడియాలో వ్యంగ్యంగా ప్రారంభమైన ఒక యువజన ఉద్యమం దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులను, నిరుద్యోగ యువతను ఏకం చేసి, చివరకు కేంద్ర ప్రభుత్వాన్ని చర్చల బల్లపైకి తీసుకురావడం, తమ ప్రధాన డిమాండ్లను అంగీకరించే పరిస్థితి తీసుకురావడం ఇటీవలి భారత రాజకీయాల్లో అత్యంత విశేషమైన పరిణామంగా నిలిచింది. "కాక్రోచ్ జనతా పార్టీ " పేరుతో ప్రారంభమైన ఈ ఉద్యమం కేవలం ఒక వైరల్ ప్రచారం కాదు. యువతలో పేరుకుపోయిన అసంతృప్తి, నిరుద్యోగం, పరీక్షల అవకతవకలు, ప్రభుత్వ జవాబుదారీతనం వంటి అంశాలపై వ్యక్తమైన సామూహిక రాజకీయ స్పందనగా అనేక జాతీయ, అంతర్జాతీయ మీడియా సంస్థలు విశ్లేషించాయి. ఈ ఉద్యమానికి మూలం ఒక వ్యంగ్య వ్యాఖ్య. "కాక్రోచ్" అనే పదాన్ని అవమానకరంగా ఉపయోగించిన సందర్భాన్ని యువత తమ ఆత్మగౌరవ చిహ్నంగా మార్చుకుంది. అవమానాన్ని ప్రతిఘటనగా, హేళనను రాజకీయ భాషగా, మీమ్‌లను ఉద్యమ సాధనంగా మార్చడం ఈ ఉద్యమం ప్రత్యేకత. గార్డియన్, అసోసియేటెడ్ ప్రెస్, సీబీఎస్, అల్ జజీరా వంటి అంతర్జాతీయ మీడియా సంస్థలు దీనిని భారత జనరేషన్-జెడ్ రాజకీయ చైతన్యానికి కొత్త రూపంగా అభివర్ణించాయి. ప్రారంభంలో ప్రభుత్వం ఈ ఉద్యమాన్ని పెద్దగా పట్టించుకోలేదు. కొంతమంది నేతలు దీనిని సోషల్ మీడియా హడావుడిగా కొట్టిపారేశారు. అయితే నిరంతర నిరసనలు, జంతర్ మంతర్ వద్ద వేలాది మంది విద్యార్థుల సమీకరణ, దేశవ్యాప్తంగా విస్తరించిన మద్దతు, అంతర్జాతీయ మీడియా దృష్టి పరిస్థితిని మార్చేశాయి. చివరకు కేంద్ర ప్రభుత్వం చర్చలు జరిపి కీలక డిమాండ్లను పరిశీలించేందుకు అంగీకరించడంతో పాటు, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం ఈ ఉద్యమానికి అతిపెద్ద రాజకీయ విజయంగా పరిగణించబడింది. అలాగే నిరసనకారులపై నమోదైన కేసులను ఉపసంహరించుకోవడం, పరీక్షల సంస్కరణలపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం కూడా ఈ పరిణామంలో భాగమయ్యాయి. ఇది కేవలం ఒక మంత్రి రాజీనామా కథ కాదు. గత కొన్నేళ్లుగా ప్రభుత్వ నియామక పరీక్షల్లో పేపర్ లీకులు, పరీక్షల రద్దు, సాంకేతిక లోపాలు, నియామకాల ఆలస్యం వంటి సమస్యలు లక్షలాది మంది యువత భవిష్యత్తును ప్రభావితం చేశాయి. ఉద్యోగాల కొరత, నిరుద్యోగం, పరీక్షలపై నమ్మకం కోల్పోవడం వంటి అంశాలు కలిసి యువతలో తీవ్ర అసంతృప్తిని పెంచాయి. అదే అసంతృప్తికి కాక్రోచ్ ఉద్యమం రాజకీయ రూపం ఇచ్చిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ ఉద్యమం మరో ముఖ్యమైన అంశాన్ని బయటపెట్టింది. 2014 తర్వాత సోషల్ మీడియాను రాజకీయ ప్రచారానికి అత్యంత సమర్థవంతంగా ఉపయోగించిన పార్టీగా బీజేపీ గుర్తింపు పొందింది. కానీ ఇప్పుడు అదే డిజిటల్ వేదికలు ప్రభుత్వంపై విమర్శలకు, వ్యంగ్యానికి, యువత ఐక్యతకు ఆయుధాలయ్యాయి. మీమ్‌లు, చిన్న వీడియోలు, వ్యంగ్య పోస్టులు కోట్లాది మంది యువతను ఆకర్షించాయి. ఒకప్పుడు అధికారానికి బలాన్నిచ్చిన డిజిటల్ ప్రపంచమే ఇప్పుడు అధికారాన్ని ప్రశ్నించే వేదికగా మారిందని అనేక విశ్లేషణలు పేర్కొన్నాయి. ఈ ఉద్యమం భారత ప్రజాస్వామ్యానికి మరో సందేశాన్ని కూడా ఇచ్చింది. యువత రాజకీయాల పట్ల నిరాసక్తంగా ఉందనే అభిప్రాయాన్ని ఇది సవాలు చేసింది. ఉద్యోగం, విద్య, పరీక్షలు, భవిష్యత్తు వంటి ప్రత్యక్ష సమస్యలు తలెత్తినప్పుడు యువత ఎంత వేగంగా సంఘటితమవుతుందో ఈ ఉద్యమం చూపించింది. సంప్రదాయ రాజకీయ పార్టీలకు వెలుపల కూడా భారీ ప్రజా చైతన్యం ఏర్పడగలదని ఇది నిరూపించింది. అయితే ఈ ఉద్యమాన్ని విమర్శించినవారూ ఉన్నారు. సోషల్ మీడియా ఉత్సాహం దీర్ఘకాల రాజకీయ ప్రత్యామ్నాయంగా మారుతుందా? ఉద్యమం తర్వాత సంస్థాగత నిర్మాణం ఎలా ఉంటుంది? వ్యంగ్యం మాత్రమే సరిపోతుందా? వంటి ప్రశ్నలు కూడా లేవనెత్తబడ్డాయి. ప్రభుత్వంతో చర్చల



అనంతరం నిరసనలు విరమించడాన్ని కొందరు వ్యూహాత్మక విజయంగా చూస్తే, మరికొందరు ఉద్యమ ఉత్సాహం తగ్గే ప్రమాదంగా అభివర్ణించారు. ఈ ఉద్యమంలో మరో ఆసక్తికర అంశం ప్రముఖుల మౌనం. అనేక సినీ, క్రీడా ప్రముఖులు స్పందించకపోవడంపై తీవ్ర విమర్శలు వచ్చాయి. ప్రజల మద్దతుతో ఎదిగిన ప్రముఖులు ప్రజా సమస్యలపై ఎందుకు మాట్లాడటం లేదనే ప్రశ్నలు దేశవ్యాప్తంగా చర్చకు దారితీశాయి. ఇది భారత ప్రజా జీవితంలో సెలబ్రిటీల సామాజిక బాధ్యతపై కొత్త చర్చకు నాంది పలికింది. మొత్తానికి, కాక్రోచ్ జనతా పార్టీ కథను కేవలం ఒక వ్యంగ్య ఉద్యమంగా చూడడం సరైంది కాదు. అది భారత యువతలో పెరుగుతున్న అసహనం, అవకాశాల కోసం పోరాటం, జవాబుదారీతనాన్ని డిమాండ్ చేసే ప్రజాస్వామ్య స్ఫూర్తికి ప్రతీకగా నిలిచింది. ప్రభుత్వం చివరకు చర్చలకు రావడం, కొన్ని కీలక డిమాండ్లను అంగీకరించడం ప్రజాస్వామ్యంలో ప్రజా ఒత్తిడికి ఉన్న శక్తిని గుర్తు చేసింది. అదే సమయంలో ఉద్యమాల విజయాన్ని కేవలం తక్షణ రాజకీయ ఫలితాలతో కాకుండా, దీర్ఘకాలిక విధాన మార్పులు, పరీక్షల పారదర్శకత, ఉద్యోగాల సృష్టి, యువత విశ్వాస పునరుద్ధరణ వంటి అంశాల ద్వారా మాత్రమే కొలవాలి. ఈ సంఘటన భారత రాజకీయాలకు ఒక హెచ్చరిక కూడా, ఒక పాఠం కూడా-ప్రజల ఆవేదనను, ముఖ్యంగా యువత ఆవేదనను, ఎంతకాలం విస్మరించినా ఒక దశలో అది అధికారాన్నే చర్చల బల్లపైకి తీసుకువచ్చే శక్తిగా మారుతుంది.

.......................

**డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్.**
**9849328496.**

**పద్మశాలి సంఘం కమిటీ హాల్ నిర్మాణ స్థలాన్ని**

## పరిశీలించిన మున్సిపాలిటీ చైర్మన్



**వాస్తవం : తిరుమలగిరి**

తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని ఐదవ వార్డ్ పద్మశాలి కాలనీలో తిరుమలగిరి చేనేత సహకార సంఘం అధ్యక్షులు వంగరి బ్రహ్మం ఆధ్వర్యంలో శనివారం రోజున ఐదవ వార్డ్ కౌన్సిలర్ తిరుమణి యాదగిరి, కోఆప్షన్ మెంబర్ మోడెపు పద్మ, ఏఈ అనిల్ లతో కలిసి మున్సిపాలిటీ చైర్మన్ సంకేపల్లి రఘునందన్ రెడ్డి సుమారు 15 లక్షల రూపాయలతో నిర్మాణం చేయనున్న పద్మశాలి కమ్యూనిటీ హాల్ నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే నిర్మాణ పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుమలగిరి పద్మశాలి సంఘం నాయకులు మహేశ్వరం జయ చందర్, చేనేత సహకార సంఘం కోశాధికారి ఎలే మల్లయ్య, కార్యదర్శి చింతకింది సోమనారాయణ, డైరెక్టర్లు మద్దూరి శేషగిరి,ఏలే శ్రీనివాస్,మద్దూరి విజయ,కస్తూరి కృష్ణ, మద్దూరి వెంకటయ్య, చిలుకమారి జయ రాములు, పొట్టబత్తుల శంభయ్య, వెంగలి మధు,వంగరి కోటయ్య, కోట రాములు తదితరులు పాల్గొన్నారు

**శిష్యుడు చేతుల మీదుగా పూర్తి చేసిన దరఖాస్తును**

## బి.ఎల్.ఓ.కి అందచేసిన గురువు




**వాస్తవం : జూబ్లీహిల్స్.**

భారత ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా అర్హులైన పౌరులందరికీ ఓటు హక్కు కల్పించడానికి నిర్దిష్ట వ్యవధిలో నిర్వహించే సమగ్ర ప్రక్రియ ఓటర్ల జాబిత ప్రత్యేక సవరణ ప్రక్రియ ( సర్). అటువంటి ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ కార్యక్రమాన్ని జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో భారతీయ జనతా పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా జనరల్ సెక్రెటరీ డి. ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రజలకు సర్ కి సంబంధించిన నియమాలను తెలుపుతూ, ఓటు హక్కు విలువని తెలుపుతూ ముందుకు వెళ్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం 244 బూత్ లో ఓటు ఉన్న గతం లో తన గురువు అయిన యూనిక్ పబ్లిక్ స్కూల్ చైర్మన్, శ్రీ కృష్ణ నగర్ స్థానికుడు అయిన ఉపేందర్ సింగ్ పూర్తిచేసిన దరఖాస్తులు బిఎల్ఓ సూర్య కుమార్ కి ప్రేమ్ కుమార్ చేతుల మీదుగా అందజేశారు. కొసమెరుపు ఏమిటంటే శిష్యుడి చేతుల మీదుగా గురువు పూర్తి చేసిన దరఖాస్తును బి. ఎల్.ఓ కి అందచేయటం విశేషం..

# వ్యవసాయంపై ఎల్‌నినో ప్రభావం

**- ఆరుతడి పంటలే శ్రేయస్కరం**

**- సర్పంచ్ -జ్యోత్స్న అరుణ్ కుమార్**

**వాస్తవం : వీర్లపల్లి :** ప్రస్తుతం నెలకొన్న( ఎల్- నినో ) వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా తీసుకోవాల్సిన చర్యల గురించి ఈరోజు వీర్లపల్లి గ్రామ పంచాయితీలో గ్రామ సర్పంచ్ మల్లారపు జ్యోత్స్న-అరుణ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో ఆరుతడి పంటల సాగు ప్రాముఖ్యత మరియు అవరాలు , చిరు ధాన్యాల సాగు గురించి వివరించారు. అలాగే ఈ పరిస్థితులను ఎదుర్కోవడానికి ప్రభుత్వం అందించే బోర్ వెల్ రీచార్జ్ గుంత మరియు



వ్యవసాయ కుంటల గురించి వివరించారు..కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మెన్,మండల స్పెషల్ ఆఫీసర్, డీ టి , ఎంపీఓ, ఏవో, జిపిఓ టెక్ని కాల్ అసిస్టెంట్, ఉపసర్పంచ్ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్స్ సంక్షేమ సంఘం
Red 914/2015
జర్నలిస్టుల సంక్షేమమే పరమావధిగా
జర్నలిస్టుల హక్కుల కోసం....
వాళ్ల ప్రగతి కోసం... పత్రికా స్వేచ్ఛ కోసం...
సభ్యత్వ నమోదు కోసం సంప్రదించండి సెల్ నెం॥ 9618616110